



మహబూబాబాద్‌లో సర్వేను పరిశీలిస్తున్న కలెక్టర్ అద్వైత్‌కుమార్ సింగ్ (ఫైల్)



కురవి ఎంపీడీవో కార్యాలయంలో సర్వే డేటా ఎంట్రీని పరిశీలిస్తున్న ఎంపీడీవో వీరబాబు

100% పూర్తి

సమగ్ర సర్వే సక్సెస్

- జిల్లాలో 2,68,018 కుటుంబాల గణన
- కొనసాగుతున్న డేటా ఎంట్రీ
- ఈ నెల చివరి వరకు వివరాలు నమోదయ్యేలా కసరత్తు

మహబూబాబాద్ టౌన్, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి) : సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వే జిల్లాలో ఈనెల 25 నాటికి వందశాతం పూర్తయింది. కలెక్టర్ అద్వైత్‌కుమార్ పర్యవేక్షణలో అధికారులు, సిబ్బంది గణనను పూర్తి చేశారు. కలెక్టర్ ఎప్పటికప్పుడు సర్వేను పరిశీలిస్తూ.. అధికారులకు, సిబ్బంది దిశానిర్దేశం చేశారు. జిల్లా వ్యాప్తంగా అన్ని మండల కేంద్రాల్లో సర్వేలో సేకరించిన కుటుంబాల వివరాలను 'ఆన్‌లైన్'లో పొందు పరుస్తున్నారు. మం డల పరిషత్, తహసీల్ ఆఫీస్, ఎమ్మార్సీ కార్యాలయాల్లో ప్రత్యేకంగా డేటా ఎంట్రీ చేస్తున్నారు.

జిల్లాలో నాలుగు మునిసిపాలిటీలు డోర్నకల్, మానుకోట, తొర్రూరు, మరిపెడతో పాటు 18 మండలాల పరిధిలో మొత్తంగా 2,65,779 కుటుంబాలను గుర్తించగా, అదనంగా 2,239 కుటుంబాలను కలుపుకుని 2,68,018 కుటుంబాల సర్వేను (100.8శాతం) పూర్తి చేశారు. ఇందులో నాలు గు మునిసిపాలిటీల పరిధిలో 37,496 కుటుంబాలను గుర్తించగా.. అదనంగా 297 కలుపుకుని 37,793 కుటుంబాల సర్వేను పూర్తి చేశారు. ఇక 18 మండలాల పరిధిలో 2,28,283 కుటుంబాలను గుర్తించగా, అదనంగా 1942 కుటుంబాలతో కలుపుకుని 2,30,225 (100.9 శాతం) కుటుంబాల సర్వేను పూర్తి చేశారు. ఇంకా అక్కడక్కడ వలసలు వెళ్లిన వారు, ఇళ్లలో సమయానికి లేనివారు ఎవరైనా ఉంటే వారి వివరాలను కూడా సేకరిస్తున్నారు.

సర్వే జరిగింది ఇలా..

మహబూబాబాద్ జిల్లాలో నాలుగు మునిసిపాలిటీలు, 18 మండలాల పరిధిలోని 461 గ్రామ పంచాయతీల్లో 2,65,779 కుటుంబాలను గుర్తించారు. ఇందులో నాలుగు మునిసిపాలిటీల పరిధిలో 37,496 కుటుంబాలు, 18 మండలాల పరిధిలో 2,28,283 కుటుంబాలను గుర్తించారు. ఆయా కుటుంబాలను సర్వే చేసేందుకు ప్రతీ 150 కుటుంబాలకు ఒక్కో ఎన్యుమరేటర్‌ను నియమించారు. సర్వే పర్యవేక్షణకు 10మంది ఎన్యురేటర్లకు ఒక్కో సూపర్‌వైజర్‌ను నియమించారు. అలా జిల్లాలో 2,65,779 కుటుంబాల సర్వే కోసం 2,034 మంది ఎన్యుమరేటర్లను నియమించారు. ఈనెల 6న సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వే ప్రారంభం కాగా, 8 వరకు ఇంటింటికి తిరిగి స్టిక్కర్లు వేశారు. 9 నుంచి ఎన్యుమరేటర్లు ఇంటింటికి వెళ్లి కులగణనతో పాటు కుటంబసభ్యుల సమగ్ర వివరాలను సేకరించారు. ఈనెల 25తో జిల్లాలోని అన్ని గ్రామ పంచాయతీలు, మునిసిపాలిటీల్లో సర్వేను వందశాతం పూర్తి చేశారు.

మండలం	కుటుంబాలు	సర్వే పూర్తయినవి	శాతం
బయ్యారం	15414	15468	100.4
చిన్నగూడూరు	5347	5556	103.9
దంతాలపల్లి	10249	10392	101.4
డోర్నకల్	12623	13284	105.2
గంగారం	3791	3997	105.4
గార్ల	13228	13101	99.0
గూడూరు	18572	18706	100.7
ఇనుగుర్తి (కేసముద్రం)	3926	3916	99.7
ఇనుగుర్తి (నెల్లికుదురు)	2461	2750	111.7
కేసముద్రం	18686	18584	99.5
కొత్తగూడ	10118	10097	99.8
కురవి	16712	16739	100.2
మహబూబాబాద్	14142	14366	101.6
మరిపెడ	20461	19482	95.2
నర్సింహులపేట	9990	9990	100.0
నెల్లికుదురు	16829	17675	105.0
పెద్దవంగర	10045	10021	99.8
సీరోలు (డోర్నకల్)	2190	2208	100.8
సీరోలు (కురవి)	5511	5552	100.7
తొర్రూరు	17988	18341	102.0
మునిసిపాలిటీలు..			
డోర్నకల్	4171	4103	98.4
మహబూబాబాద్	21432	21880	102.1
మరిపెడ	5293	5267	99.5
తొర్రూరు	6600	6543	99.1
మొత్తం	**2,65,779**	**2,68,018**	**100.8**

తొలుత నెమ్మదిగా.. ఆపై వేగంగా..

జిల్లాలో సమగ్ర ఇంటింటికుటుంబ సర్వే ప్రారంభంలో కాస్త నెమ్మదిగా సాగినప్పటికి రెం డు, మూడు రోజుల్లో వేగం పెరిగింది. సర్వే ఫారం 8 పేజీల్లో 56 అంశాలతో 75 ప్రశ్నలు ఉం డడంతో ఇందులో ఎన్యుమరేటర్లు ప్రతీ ఇంటికి వెళ్లి దానిలో యజమాని పేరు, ఆధార్ కార్డు, కుటుంబసభ్యుల పేర్లు, ధరణి పాస్‌బుక్ నెంబరు, ఫోన్ నెంబర్‌ను పూరించగా ఇక మిగతా అంశాలకు సంబంధించి కోడ్ ఆధారంగా నింపారు. దీంతో ప్రతీ ఇంటికి దాదాపు 20 నిమిషాల సమయం పట్టింది. ఈ క్రమంలో తొలుత కాస్తా మందకొడిగా సాగిన సర్వే క్రమక్రమం గా ఊపందుకుంది. రోజూ ఒక్కో ఎన్యుమరేటర్ సుమారు 20 కుటుంబాల వివరాలను సేకరించారు. జిల్లాలో గుర్తించిన కుటుంబాలతో పాటు అదనంగా ఉన్న కుటుంబాల వివరాల సమగ్ర సమాచారాన్ని సేకరించి, కంప్యూటర్‌లో డేటా ఎంట్రీ చేస్తున్నారు. జిల్లాలోని అన్ని మండల పరిషత్, తహసీల్దార్, ఎమ్మార్సీ కార్యాలయాల్లో సర్వే వివరాలను కంప్యూటర్‌లో నమోదు చేస్తున్నారు. డేటా ఎంట్రీ కార్యక్రమం మాత్రం వేగంగా కొనసాగుతోంది. ఈ ప్రక్రియ ఈనెల 30వ తేదీ వరకు పూర్తి చేసేందుకు అధికారులు ప్రణాళికలు తయారు చేసి ముందుకు సాగుతున్నారు.



బాప్‌రే.. ఇగం

నర్సింహులపేట మండల కేంద్రంలో చలిమంట కాగుతున్న ప్రజలు

- రోజు రోజుకూ పెరుగుతున్న చలి
- పట్టణాలు, పల్లెల్లో వణుకుతున్న జనం
- ఉదయం నుంచి సాయంత్రం వరకు చల్లని గాలులు..
- జిల్లాలో కనిష్ఠంగా 13.3 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదు
- పిల్లలు, వృద్ధులు జాగ్రత్తలు పాటించాలంటున్న వైద్యులు

8

ఈనెల 30, డిసెంబరు 1న జిల్లాస్థాయి సైన్స్ ఎగ్జిబిషన్

- జిల్లా విద్యాశాఖాధికారి రవీందర్‌రెడ్డి

మహబూబాబాద్ ఎడ్యుకేషన్, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి) : జిల్లా కేంద్రంలోని మోడల్ స్కూల్‌లో ఈనెల 30, డిసెంబరు 1న జిల్లాస్థాయి సైన్స్ ఎగ్జిబిషన్, ఇన్స్‌పైర్ మానక్ అవార్డుల ప్రదర్శనలు నిర్వహిస్తున్నట్లు జిల్లా విద్యాశాఖాధికారి రవీందర్‌రెడ్డి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. 2024-25 సంవత్సరానికి సంబంధించి సుస్థిర భవిష్యత్తు కోసం సైన్స్‌అండ్ టెక్నాలజీ ప్రధానాంశంగా ఆహారం, ఆరోగ్యం, శుభ్రత, రవాణా, కమ్యూనికేషన్స్, సహజ వ్యవసాయం, విపత్తు నిర్వహణ, గణిత నమూన, వ్యర్థాల నిర్వహణ, వనరుల నిర్వహణ అనే ఉప అంశాలపై ఆరు నుంచి 12 తరగతుల విద్యార్థులకు బాలవైజ్ఞానిక ప్రదర్శన నిర్వహించబడుతుందని తెలిపారు. ఈ వైజ్ఞానిక ప్రదర్శనల విజయవంతం కోసం 16 కమిటీలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈ ప్రదర్శనలు తిలకించేందుకు 8,9, 10 తరగతుల విద్యార్థులకు మాత్రమే అనుమతి ఉంటుందన్నారు.

- ఈనెల 30న డోర్నకల్, గార్ల, బయ్యారం, కురవి, సీరోలు, మరిపెడ, దంతాలపల్లి, నర్సింహులపేట, చిన్నగూడూరు మండలాల విద్యార్థులు, డిసెంబరు 1న మహబూబాబాద్, కేసముద్రం, నెల్లికుదురు, గూడూరు, కొత్తగూడ, గంగారం, తొర్రూరు, ఇనుగుర్తి, పెద్దవంగర మండలాలతో పాటు జిల్లాలోని అన్ని యాజమాన్యాలరెసిడెన్షియల్ పాఠశాలల విద్యార్థులు రావాలని సూచించారు. వివరాలకు జిల్లా సైన్స్ అధికారి అప్పారావు సెల్ నెంబర్ : 9849598281ను సంప్రదించాలన్నారు.



కేసముద్రం వ్యవసాయ మార్కెట్‌కు విక్రయానికి వచ్చిన ధాన్యం

కేసముద్రం మార్కెట్‌కు పోటెత్తిన ధాన్యం

- 13 వేల బస్తాల రాక
- 'మద్దతు'కు మించి ధర
- సగటున క్వింటాకు రూ.2,680
- బోనస్‌తో ప్రభుత్వ కొనుగోలు కేంద్రాలకే రైతుల మొగ్గు

6

ఫార్మసీ కళాశాలలో ప్రవేశానికి దరఖాస్తుల ఆహ్వానం

మహబూబాబాద్ ఎడ్యుకేషన్, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి) : జిల్లా కేంద్రంలోని తెలంగాణ సోషల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ మహిళా ఫార్మసీ కళాశాలలో 2024-25 విద్యాసంవత్సరంలో ఖాళీగా ఉన్న సీట్లను భర్తీ చేయనున్నట్లు ప్రిన్సిపాల్ స్వప్నరెడ్డి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. టీజీఈఏపీసీసీటీ-2024లో అర్హత సాధించిన విద్యార్థినులు డిసెంబరు 9న ఉదయం 10 గంటలకు స్థానిక కళాశాలలో ఒరిజినల్ సర్టిఫికెట్లు, ర్యాంకు కార్డుతో స్పాట్ కౌన్సిలింగ్‌కు హాజరుకావచ్చని సూచించారు. ఖాళీల వివరాలను కళాశాల నోటీస్ బోర్డుపై అందుబాటులో ఉంచామన్నారు. స్పాట్ కౌన్సిలింగ్‌లో రిజర్వేషన్ ప్రాతిపాదికన సీటు పొందిన విద్యార్థినులు ప్రాసెసింగ్ ఫీజు చెల్లించవలసి ఉంటుందన్నారు. జిల్లాలోని అర్హులైన విద్యార్థినులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

నిబంధనల మేరకు వడ్లు కొనుగోలు చేయాలి

- రైతులు మద్దతు ధర పొందాలి
- కలెక్టర్ అద్వైత్‌కుమార్ సింగ్



పాగుళ్లపల్లిలో అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ అద్వైత్‌కుమార్ సింగ్

కొత్తగూడ, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి) : ఎలాంటి అవకతవకలు జరుగకుండా, నిబంధనల మేరకు ధాన్యం కొనుగోలు చేయాలని కలెక్టర్ అద్వైత్‌కుమార్‌సింగ్ సూచించారు. కొత్తగూడలోని పొగుళ్లపల్లి, కోనాపురం, ఓటాయి, రేణ్యాతండా, సాధిరెడ్డిపల్లిలోని వడ్ల కొనుగోలు సెంటర్లను ఆయన తనిఖీ చేశారు. వ్యవసాయశాఖ, ఐకేపీ అధికారులు, ఆయా కొనుగోలు కేంద్రాల నిర్వాహకుల నుంచి ఇప్పటి వరకు కొనుగోలు చేసిన ధాన్యం వివరాలను తెలుసుకున్నారు. రిజిష్టర్‌లను పరిశీలించి, పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రైతులకు ఇబ్బందులు కలుగకుండా కేంద్రాలలో సౌకర్యాలు కల్పించాలన్నారు. ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాలలో రైతులు ధాన్యం విక్రయించి, మద్దతు ధర పొందాలన్నారు.

విద్యార్థులకు మెరుగైన విద్య అందించాలి

విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించాలని అద్వైత్‌కుమార్‌సింగ్ సూచించారు. సాధిరెడ్డిపల్లిలోని గిరిజన సంక్షేమశాఖ ఆశ్రమ ఉన్నత పాఠశాలను ఆయన ఆకస్మి క తనిఖీ చేశారు. వంటగదిని, పాఠశాలలోని గదులను, మూత్రశాలలను పరిశీలించారు. తరగది గదిలో విద్యార్థులకు ప్రశ్నలు వేసి, జవాబులు తెలుసుకున్నారు. వి ద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించాలని హెచ్‌ఎం కల్తీ శ్రీనుకు సూచించారు. కార్యక్రమంలో తహసీల్దారు రమాదేవి, ఎంపీడీవో రవీంద్రప్రసాద్, ఏవో ఉదయ్, ఏపీఎం శ్రీనివాస్, ఏఈవోలు, రైతులు పాల్గొన్నారు.

ఆయిల్‌పామ్ సాగుతో లాభాలు

- జిల్లా ఉద్యాన అధికారి జినుగు మరియన్న



ఉప్పరిగూడెంలో ఆయిల్‌పామ్ తోటలోని డ్రిప్ ఇరిగేషన్‌ను పరిశీలిస్తున్న మరియన్న

మహబూబాబాద్ అగ్రికల్చర్, నవంబరు27 (ఆంధ్రజ్యోతి): వరి పంట మార్పిడి చేసి, ఆయిల్‌పామ్ తోటలను పెంచుకుంటే లాభాల బాటలో నడువచ్చునని జిల్లా ఉద్యాన, పట్టుపరిశ్రమ అధికారి జినుగు మరియన్న రైతులకు సూచించారు. జిల్లాలోని కాంపెల్లి, ఉప్పరిగూడెం, మోద్గులగూడెం, నేరడ, జంగిలిగొండ గ్రామాల్లో బుధవారం ఆయన ఆయిల్‌పామ్ తోటలను, మిర్చి, పత్తి, బంతి, చామంతి, మామిడి, కూరగాయాల తోటలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పంట మార్పిడిచేసి ఆయిల్‌పామ్ తోటలను సాగు చేస్తే.. ఆ తోటల్లో అంతర్ పంటలుగా కూరగాయలు, ఇతర పంటలను పండించుకుంటే లాభదాయకంగా ఉంటుందన్నారు. మార్కెట్‌లో డిమాండ్ ఉన్న పంటలను సాగు చేయాలని, రోగ నిరోధకశక్తి, ఆరోగ్యంగా ఉండడానికి పోషకాలు అందించే పండ్ల తోటలైన జామ, నిమ్మ, అరటి, బొప్పాయి, సీతాఫలం, పనస, నేరేడు, ఆవకాడు, ఫ్యాషన్‌ఫ్రూట్, కూరగాయాలు, ఆకుకూరలు, మునగ, వెదురు తోటలను సాగు చేసుకుంటే రూ.లక్ష వరకు ఎకరానికి నికర ఆదాయం పొందవచ్చని సూచించారు. ప్రతీ రైతు పొలం గట్లపై, ఇండ్లలోని పెరట్లలోనూ ఆయిల్‌పామ్ మొక్కలు పెంచుకోవాలన్నారు. ఈ క్షేత్ర ప్రదర్శనలో రైతులు ప్రభాకర్‌రెడ్డి, రంజిత్‌రెడ్డి, కల్యాణ్, చందు, మైక్రో, ఇరిగేషన్ ఇంజనీర్ రాధాకిషోర్, బిందుసేద్యం అధికారులు పాల్గొన్నారు.

'ఆన్‌లైన్'లో అధికవడ్డీ ఆశచూపి.. రూ.4.26 లక్షల మాయం

- సోమ్లతండాలో మోసపోయిన యువకుడు

మహబూబాబాద్ రూరల్, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి) : 'ఆన్‌లైన్'లో ఓ అపరిచిత వ్యక్తి అధికవడ్డీ ఆశచూపి మహబూబాబాద్ మండలం సోమ్లతండాకు చెందిన ఓ యువకుడి బ్యాంక్ ఖాతా నుంచి రూ.4.26 లక్షలు మాయం చేసినట్లు రూరల్‌ఎస్సై దీపికరెడ్డి బుధవారం తెలిపారు. ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం. సోమ్లతండాకు చెందిన బాదావత్ యుగందర్ బీటెక్ పూర్తిచేసి, హైదరాబాద్‌లో గ్రూప్ ఉద్యోగాల కోసం కోచింగ్ తీసుకుంటున్నాడు. ఈ క్రమంలో గత అక్టోబర్ 9వ తేదీన టెలిగ్రామ్ యాప్ ద్వారా ఓ అపరిచిత వ్యక్తిద్వారా ఫోన్‌కాల్ వచ్చింది. మీరు యాప్‌లో పెట్టుబడి పెడితే, అధిక వడ్డీ వస్తుందని యుగందర్‌కు ఆశ చూపాడు. ఇది నమ్మిన ఆయన తన బ్యాంకు ఖాతా ద్వారా రెండు విడతలుగా రూ.4,26,966లను పెట్టుబడి పెట్టాడు. నెల రోజుల తర్వాత అపరచిత వ్యక్తి పలు దఫాలుగా మొత్తం రూ.4,26,966ను కాజేశాడు. దీంతో తాను మోసపోయినట్లు గ్రహించిన యువకుడు తండ్రి వద్ద వాపోయాడు. దీంతో యుగందర్ తండ్రి ధరావత్ వెంకన్న మహబూబాబాద్ రూరల్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. వెంకన్న ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

కొనుగోలు కేంద్రాలను వినియోగించుకోవాలి

- జిల్లా వ్యవసాయాధికారి విజయనిర్మల



బావోజితండాలో వడ్ల కొనుగోలు కేంద్రాన్ని పరిశీలిస్తున్న విజయనిర్మల

పెద్దవంగర, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి) : గ్రామాల్లో ప్రభుత్వం ఏర్పాటు చేస్తున్న కొనుగోలు కేంద్రాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా వ్యవసాయాధికారి విజయనిర్మల సూచించారు. బుధవారం మండలంలోని బావోజితండా పీఏసీఎస్ కొనుగోలు కేంద్రాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా రైతులతో మాట్లాడుతూ కొనుగోలు కేంద్రాల్లోనే మద్దతు ధర లభిస్తుందని, ప్రభుత్వం అందిస్తున్న బోనస్‌ను 48 గంటల్లో ఖాతాల్లో పడే విధంగా చర్యలు తీసుకుంటామన్నారు. దళారులను ఆశ్రయించి మోసపోవద్దని, రైతులెవరూ ఆందోళన చెందవద్దని ప్రభుత్వమే కొనుగోలు చేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో ఏవో స్వామి, గోపాల్‌నాయక్, ఏఈవో రాజు తదితరులు ఉన్నారు.

యువత మాదక ద్రవ్యాలకు బానిస కావొద్దు

- జిల్లా సీడబ్ల్యూసీ చైర్మన్ నాగవాణి



మాట్లాడుతున్న నార్కోటిక్స్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ రవీందర్

తొర్రూరు, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి) : యువత మాదక ద్రవ్యాలకు బానిస కావొద్దని జిల్లా సీడబ్ల్యూసీ చైర్మన్ నాగవాణి, నార్కోటిక్స్ సర్కిల్ ఇన్స్‌పెక్టర్ రవీందర్ అన్నారు. నెహ్రూ యువ కేంద్రం ఆధ్వర్యంలో బుధవారం మాదక ద్రవ్యాల నియంత్రణపై బుధవారం తొర్రూరు ప్రభుత్వ జూనియర్ కళాశాలలో వర్క్‌షాప్ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మాదక ద్రవ్యాలు తీసుకుంటే జీవితంలో ఎలాంటి అనర్థాలు జరుగుతాయో వారికి వివరించారు. క్షణికానందం కోసం నిండు జీవితాన్ని బలిచేసుకోవద్దని, ఒకసారి అలవాటైతే అది వ్యసనంగా మారుతుందన్నారు. యువత మత్తుకు బానిసలు కావద్దని, చుట్టు పక్కల ఎవరైనా మాదక ద్రవ్యాలు సేవిస్తూ కనిపిస్తే డయల్ 100, 1933కి కాల్ చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ శ్రీనివాస్‌రెడ్డి, ప్రోగ్రామ్ ఆఫీసర్ నారాయణ, సువర్ణ, ఉప్పలయ్య, చారి, మల్లయ్య, శివరామకృష్ణ, హనుమాన్‌నాయక్, అలి, రాజు తదితరులు ఉన్నారు.

మునిసిపాలిటీ భవన నిర్మాణాన్ని త్వరగా పూర్తి చేయాలి

- ప్రజలకు ఇబ్బంది లేకుండా మౌళిక వసతులు కల్పించాలి
- ఎమ్మెల్సీ తక్కెళ్లపల్లి రవీందర్‌రావు

6

కేసముద్రం మార్కెట్‌కు పోటెత్తిన ధాన్యం

» 13 వేల బస్తాల రాక
» బోనస్‌తో ప్రభుత్వ కొనుగోలు కేంద్రాలకే రైతుల మొగ్గు

కేసముద్రం, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి) : కేసముద్రం వ్యవసాయ మార్కెట్‌కు బుధవారం ధాన్యం పోటెత్తింది. ఈ ధాన్యం సీజన్లోనే అత్యధికంగా 13,600 బస్తాలను రైతులు విక్రయానికి తీసుకువచ్చారు. ఇందులో 11,031 బస్తాలకు ఎలక్ర్టానిక్ నేషనల్ అగ్రికల్చర్ మార్కెట్(ఈ-నామ్) విధానం ద్వారా వేలం పాటలు నిర్వహించారు.

మార్కెట్‌కు 271 మంది రైతులు 11,031 బస్తాల్లో 7,170 క్వింటాళ్ల ధాన్యం తీసుకురాగా, ఇందులో జైశ్రీరాం రకం ధాన్యం 11 మంది రైతులు 291 బస్తాల్లో 189 క్వింటాళ్లు, ఆర్ఎన్ఆర్ రకం 137 మంది రైతులు 6,080 బస్తాల్లో 3,952 క్వింటాళ్లు, హెచ్ఎంటీ రకం ధాన్యం 123 మంది రైతులు 4,660 బస్తాల్లో 3,029 క్వింటాళ్లు ఉన్నాయి.

ఈ-నామ్ విధానంలోని 'ఈ-చేలం'లో జైశ్రీరాం రకం ధాన్యం క్వింటాకు గరిష్ఠంగా రూ.3,000, కనిష్ఠంగా రూ.2,729, సగటున రూ.2909, ఆర్ఎన్ఆర్ క్వింటాకు రూ.2702, రూ.2411, రూ.2,686, హెచ్ఎంటీ రకం ధాన్యం క్వింటాకు గరిష్ఠంగా రూ.2,589, కనిష్ఠంగా రూ.2401, సగటున రూ.2,551 ధరల చొప్పున వ్యాపారులు ఖరీదులు చేశారు. మార్కెట్లోని కవర్ షెడ్లన్నీ నిండిపోవడంతో పాత మార్కెట్ కార్యాలయం చుట్టూ ఉన్న ఓపెన్ యార్డు లోను ధాన్యం రాశులు పోసుకున్నారు.


కేసముద్రం వ్యవసాయ మార్కెట్‌కు విక్రయానికి వచ్చిన ధాన్యం

వారంలో క్వింటాల్‌కు రూ.150 పెరిగిన ధర

కేసముద్రం మార్కెట్లో ధాన్యం ధరలు ఈ వారం రోజుల్లో క్వింటాకు రూ.150 చొప్పున ధర పెరిగాయి. ఆర్ఎన్ఆర్ గత వారం రూ.2450 నుంచి రూ.2500 వరకు సగటు ధరలు ఉండగా తాజాగా రూ.2650 నుంచి రూ.2700 వరకు నమోదవుతున్నాయి. రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల్లో ఉన్న బ్రాండెడ్ బియ్యం కంపెనీల నుంచి ధాన్యం డిమాండ్ ఉండడంతో ఇక్కడి వ్యాపారులు ధరలు పెంచి ఖరీదు చేస్తున్నారు. స్థానిక మార్కెట్లో ధర స్వల్పంగా పెరిగిందని తెలుస్తోంది. ఈ ధర మరింత పెరిగే అవకాశం లేదని కొద్దిరోజులు నిలకడగా ఉంటుందని వ్యాపారులు భావిస్తున్నారు. మరోవైపు సన్న ధాన్యానికి ప్రభుత్వ కనీస మద్దతు ధర (ఎం ఎస్‌పీ) క్వింటాకు రూ.2320 ఉండగా అంతకుమించి మార్కెట్‌లో ధరలు నమోదవుతుండడం గమనార్హం. అయితే ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లో అదనంగా క్వింటాకు బోనస్ రూ.500లు కలుపుకొని రూ.2820 చెల్లిస్తున్నారు. దీంతో రైతులు సన్న ధాన్యాన్ని అధికంగా ప్రభుత్వ కొనుగోలు కేం ద్రాలకే తీసుకువెళ్తుండడంతో మార్కెట్‌కు తక్కువగా సరుకు రాబడులు కొనసాగుతున్నాయి.

మార్కెట్లో నిరంతర పోలీసు బందోబస్తు

కేసముద్రం వ్యవసాయ మార్కెట్లో అవాంఛనీయ ఘటనలు జరగకుండా వివిధ వర్గాల భద్రత దృష్ట్యా ముందస్తుగా బుధవారం నుంచి పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు. గతంలో ధరల తగ్గుదలపై రైతుల ఆందోళనలు, అడుగుల పేరుతో చిల్లర దొంగతనాలు జరిగిన సందర్భాల్లో పరిస్థితి సద్దుమణిగేవరకు నాలుగైదు రోజులపాటు మార్కెట్లో పోలీసుల బందోబస్తు నిర్వహించిన దాఖలాలు ఉన్నాయి. కొద్దిరోజుల క్రితం మార్కెట్లో ఒక కంపెనీకి చెందిన గుమస్తా, బీహార్ కార్మికులపై కొందరు బయటి వ్యక్తులు కత్తులతో బెదిరించి, దాడి చేసిన ఘటనలో పోలీసులు కేసు నమోదు చేశారు. ఈ నేపథ్యంలోనే రైతులు, కార్మికులు, వ్యాపారులు, మార్కెట్ అధికారులు, సిబ్బంది, ఇతర వర్గాల భద్రత దృష్ట్యా ఉన్నతాధికారుల ఆదేశాలతో పోలీసు బందోబస్తు ఏర్పాటు చేసినట్లు ఎస్ఐ మురళీధర్ తెలిపారు.


సమావేశంలో మాట్లాడుతున్న జగన్మోహన్‌రావు

అధికారులంతా ఐకమత్యంతో ఉండాలి

రాష్ట్ర ఉపాధ్యక్షుడు జగన్మోహన్‌రావు

ములుగు కలెక్టరేట్, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): ఎలాంటి సమస్యలు ఎదురైనా అధికారులందరూ ఐకమత్యంతో ఉండాలని గెజిటెడ్ ఆఫీసర్స్ అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎ.జగన్మోహన్‌రావు అన్నారు. ములుగులోని జడ్పీ హాల్‌లో గెజిటెడ్ ఆఫీసర్స్ అసోసియేషన్ ఎగ్జిక్యూటివ్ కమిటీ సమావేశం జిల్లా అధ్యక్షుడు మట్టపల్లి సంపత్‌రావు అధ్యక్షతన బుధవారం జరగ్గా ముఖ్య అతిథిగా జగన్మోహన్‌రావు హాజరయ్యారు.

ఈనెల 30న హైదరాబాద్‌లో జరిగే స్టేట్ ఎగ్జిక్యూటివ్ కమిటీ సమావేశానికి అధికారులు పెద్దసంఖ్యలో హాజరు కావాలన్నారు. అదేవిధంగా నిర్మల్ జిల్లా దిలావర్‌పూర్ వద్ద ఆర్డీవో రత్నకుమారిపై జరిగిన దాడిని తీవ్రంగా ఖండించారు. ఈ సమావేశంలో సెక్రటరీ కోల రాజేష్‌కుమార్, అసోసియేట్ ప్రెసిడెంట్ జీవన్‌కుమార్, ఉపాధ్యక్షుడు రామకృష్ణ, నాయకులు కెమసారం కొమురయ్య, సంతోష్, బిశ్రీనివాస్, శైలజ, రహీం, రాజ్‌కుమార్, యశ్వంత్, దుర్గారావు, రంజిత్, శంకర్‌రావు, బాలయ్య, నరసింహ, సారంగపాణి, రాజేశ్వర్, శిరీష, నరసింహ, విద్యాసాగర, మాధవిశీతల్, రాజేశ్వర్‌రావు, రాజు, రహీం మహమ్మద్ తదితరులు పాల్గొన్నారు.

కాళేశ్వరంలో ద్వాదశి పూజలు

మహదేవపూర్, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కాళేశ్వర ముక్తీశ్వర స్వామి ఆలయంలో బుధవారం భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. కార్తీక మాసం పర్వదినాన్ని పురస్కరించుకొని అధిక సంఖ్యలో పాల్గొన్నారు. ద్వాదశి కావడంతో తెల్లవారుజామునే గోదావరి వద్దకు చేరుకొని పుణ్యస్నానాలు ఆచరించారు. గోదావరి మాతకు చీర, సారె, కుంకుమ, పసుపులతో ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం కాళేశ్వర ముక్తీశ్వర స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు, అభిషేకాలు, మహన్యాసాక పూర్వాభిషేకం, రుద్రాభిషేకం చేశారు. శుభానందదేవి, సరస్వతిదేవి ఆలయాల్లో ఆలయంలో అమ్మవార్లకు కుంకమ పూజలు నిర్వహించారు. ఉసిరిక చెట్టు వద్ద లక్ష ముగ్గులు వేసి లక్ష వత్తులతో దీపాలను ముట్టించారు. బ్రాహ్మణోత్తములను దీపాదానం అందజేశారు.


కాళేశ్వరాలయంలో పూజల్లో పాల్గొన్న భక్తులు

భవన నిర్మాణాన్ని త్వరగా పూర్తి చేయాలి

ఎమ్మెల్సీ తక్కెళ్లపల్లి రవీందర్‌రావు


మునిసిపల్ కార్యాలయ భవన నిర్మాణాన్ని పరిశీలిస్తున్న రవీందర్‌రావు

మహబూబాబాద్ టౌన్, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి) : మానుకోట మునిసిపాలిటీ కార్యాలయ నూతన భవన నిర్మాణ పనులను త్వరితగతిన పూర్తి చేసి, ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని ఎమ్మెల్సీ తక్కెళ్లపల్లి రవీందర్‌రావు అన్నారు. మహబూబాబాద్ శివారు అనంతారం రోడ్డులో నిర్మితమవుతున్న మునిసిపల్ కార్యాలయ భవన నిర్మాణ పనులను బుధవారం పరిశీలించి, అధికారులకు తగు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మునిసిపల్ భవన పనులను నాణ్యత ప్రమాణాలతో చేపట్టి త్వరగా పూర్తి చేయాలని సూచించారు. అన్ని హంగులతో నిర్మిస్తున్న మునిసిపల్ భవనంలో వివిధ పనుల నిమిత్తం కార్యాలయానికి వచ్చే ప్రజలకు ఇబ్బందులు కలుగకుండా మౌళిక వసతులు కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో మునిసిపల్ చైర్మన్ పాల్వాయి రాంమోహన్‌రెడ్డి, వైస్ చైర్మన్ మార్నేని వెంకన్న, డీఈ ఉపేందర్, కౌన్సిలర్లు ఎడ్ల వేణుమాధ వ్, బానోత్ రవికుమార్, మంగలంపల్లి కన్న, జెరిపోతుల వెంకన్న, డౌలాగ ర్ శంకర్, అంబాల శివ కుమార్, రామకృష్ణ, చారి తదితరులు పాల్గొన్నారు.

సర్వే వివరాల నమోదు సకాలంలో పూర్తి చేయాలి


రఘునాథపల్లిలో సర్వే కంప్యూటరీకరణను పరిశీలిస్తున్న సంతోష్

రఘునాథపల్లి, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): సమగ్ర కుటుంబ సర్వే వివరాల నమోదు ప్రక్రియను సకాలంలో పూర్తి చేయాలని సమగ్ర సర్వే రాష్ట్ర కంట్రోల్ అధికారి సంతోష్ సంబంధిత అధికారులను ఆదేశించారు. మండల పరిషత్ కార్యాలయంలో సమగ్ర కుటుంబ సర్వే వివరాలను డాటా ఎంట్రీ ఆపరేటర్లు కంప్యూటరీకరణ చేస్తున్న తీరును ఆయన డిప్యూటీ సీఈవో సరితతో కలిసి బుధవారం పరిశీలించారు. సర్వే నమోదు ప్రక్రియలో ఎలాంటి తప్పులు దొర్లకుండా సకాలంలో పూర్తి చేయడానికి అవసరమైన సలహాలు, సూచనలను సంబంధిత అధికారులను అడిగి తెలుసుకోవాలని డాటా ఎంట్రీ ఆపరేటర్లకు ఆయన సూచించారు. కార్యక్రమంలో తహసీల్దార్ మోహిస్సిన్ ముజ్జబ, ఎంపీడీవో శ్రీనివాసులు, ఎంఈవో రఘునందన్ రెడ్డి, ఎంపీవో వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి పోరాటం

ఎస్టీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సదానందం

తొర్రూరు, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయుల న్యాయమైన సమస్యల పరిష్కారానికి ఎస్టీయూ అలుపెరుగని పోరాటం చేస్తోందని ఆ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సదానందం అన్నారు. బుధవారం తొర్రూరులోని ప్రాథమిక పాఠశాల ఆవరణలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. డీఏ బకాయిలు విడుదల చేసి పెండింగ్ బిల్స్, సీపీఎస్ రద్దు, పాత పెన్షన్ విధానం అమలు చేయాలని కోరారు. 2003 డీఎస్సీ ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలన్నారు.

టీచర్స్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో రాష్ట్ర జాక్టో నిర్ణయం మేరకు ఎస్టీయూ పని చేస్తుందని, ఉపాధ్యాయుల వేతన, ఇతర సప్లమెంటరీ బిల్లులు ఈ కుబేర్‌లో పెండింగ్‌లో ఉన్నాయని, జీపీఎఫ్ బిల్లులు సైతం పెండింగ్‌లో పెట్టడం వల్ల ఉపాధ్యాయులకు సకాలంలో డబ్బులు అందక ఇబ్బందులకు గురవుతున్నారని, ప్రభుత్వం స్పందించి సమస్యలు పరిష్కరించాలని కోరారు. మొదటి సారి తొర్రూరుకు వచ్చిన సందర్భంగా రాష్ట్ర నాయకులను ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఎస్టీయూ జిల్లా అధ్యక్షుడు సుధాకరాచారి, ఉపాధ్యాయులు యాకూబ్ రెడ్డి, చంద్రప్రకాశ్, శ్రీనివాస్, కుమార్, రవి తదితరులు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న సదానందం

కాంట్రాక్ట్ ఉద్యోగులను రెగ్యులరైజ్ చేయాలి

ఎల్‌హెచ్‌పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు పూల్‌సింగ్

కాటారం, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): గిరిజన శాఖలో కొన్నేళ్లుగా కాంట్రాక్ట్ పద్ధతిలో ఉద్యోగాలు చేస్తున్న వారి సర్వీసును క్రమబద్ధీక రించాలని లంబాడీ హక్కుల పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షుడు అజ్మీరా పూల్‌సింగ్ నాయక్ ప్రభుత్వాన్ని కోరారు. సంఘం ఆధ్వర్యంలో నిర్వహించనున్న 'చలో హైద రాబాద్' కార్యక్రమానికి సంబంధించిన పోస్టర్‌ను కాటారం ఎస్టీ బాలురు, బాలికల గురుకులాల ఆవరణలో ఆయన బుధవారం ఆవిష్కరించారు. గిరిజన ఆశ్రమ పాఠశాలల్లో 1,804 మంది, గిరిజన సంక్షేమ గురుకులాల్లో 491, గిరిజన సహకార సంస్థల్లో 94మంది కాంట్రాక్ట్ బోధన, బోధనేతర ఉద్యోగులు పని చేస్తున్నారని ఆయన తెలిపారు. 25ఏళ్లుగా రెగ్యులర్ కాక వారు ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించాలని కోరారు. కార్యక్రమంలో ఆదివాసీ హక్కుల పోరాట సమితి రాష్ట్ర ఉపాధ్యక్షుడు బచ్చల ఎర్రయ్య, పార్ట్ టైం ఉపాధ్యాయుల సంఘం జిల్లా అధ్య క్షుడు భూక్యా రాజుతో పాటు సంపత్, రామకృష్ణ, శ్రీనివాస్, కృష్ణమా చారి, సర్దార్‌సింగ్, స్వప్న, సారక్క, పద్మ, రజిత, రాజ శేఖర్, సత్యనా రాయణ, యాకమ్మ, మల్లయ్య, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



చలో హైదరాబాద్ పోస్టర్లను ఆవిష్కరిస్తున్న ఉద్యోగులు


ఆదివాసీ సంక్షేమ పరిషత్ మండల నూతన కార్యవర్గం

ఆదివాసీ గ్రామాలను అభివృద్ధి చేయాలి

గూడూరు, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి) : ఆదివాసీ గ్రామాలను అభివృద్ధి చేయాలని ఆదివాసీ సంక్షేమ పరిషత్ రాష్ట్ర జాయింట్ సెక్రటరీ ధనసరి రాజేష్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గూడూరు మండలం చింతలగట్టు వట్టివాగు సమ్మక్క-సారలమ్మల జాతర ప్రాంగణంలో ఆదివాసీ సంక్షేమ పరిషత్ గూడూరు మండల కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆదివాసీ గ్రామాల్లో అభివృద్ధి జరగాలంటే ఆదివాసీ చట్టాలను పకడ్బందీగా అమలు చేయలన్నారు. ప్రభుత్వం, అధికారుల నిర్లక్ష్యంతో ఆదివాసీ గ్రామాల్లో ప్రజలు అనేక ఇబ్బందులు పడుతున్నారని చెప్పారు. అనంతరం నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. ఆదివాసీ సంక్షేమ పరిషత్ మండల అధ్యక్షుడిగా దారం నరేష్, ప్రధాన కార్యదర్శిగా సోలం ప్రవీన్, ఉపాధ్యక్షులుగా వాసం భద్రయ్య, ధనసరి సారయ్య, పెనక వెంకటేష్, కార్యదర్శులుగా తురస సుధాకర్, బంగారి సుదర్శన్, వట్టం నవీన్, జాయింట్ సెక్రటరీగా ఈసం యాకయ్య, కమిటీ సభ్యులుగా ఈసం సుధాకర్, ఈసం వీరన్న, కొట్టెం రాజేష్‌ను ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో ఆదివాసీ సంక్షేమ పరిషత్ జిల్లా ఉపాధ్యక్షులు తాటి సుధాకర్, జిల్లా కార్యదర్శి పూనెం జనార్ధన్, దారం సాంబరాజు, పెనక నాగయ్య, తాటి ప్రవీన్, ఈక అశోక్, సిద్దబోయిన ఉపేందర్, కోరం రమేష్ తదితరులు పాల్గొన్నారు.

మహారాష్ట్ర ప్రీ రిపబ్లిక్ పరేడ్‌కు అంజలీదేవి

కేయూ క్యాంపస్, నవంబరు 27,(ఆంధ్రజ్యోతి): కేయూ మహిళ ఇంజనీరింగ్ కళాశాల స్టూడెంట్ తోట అంజలీ దేవి మహారాష్ట్రలో జరిగిన వెస్ట్‌జోన్ ఎన్ఎస్ఎస్ ప్రీ రిప బ్లిక్ పరేడ్ క్యాంపుకు ఎంపికై శిక్షణను దిగ్విజయంగా పూర్తిచేశారు. ఈ సందర్భంగా బుధవారం కేయూ మహిళ ఇంజనీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె. బిక్షాలు, ఎం. వేణుగోపాల్‌రెడ్డిల చేతుల మీదుగా కళాశాలలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో అంజలిదేవికి ఎన్ఎస్ఎస్ ప్రీరిపబ్లిక్ పరేడ్ సర్టిఫికెట్‌ను అందచేసి అభినందించారు. నవంబరు 12 నుంచి 21 వరకు యువజన వ్యవహారాలు, క్రీడల మంత్రిత్వ శాఖ, ఎన్ఎస్ఎస్ పూణే ప్రాంతీయ డైరెక్టరేట్ ఆధ్వర్యంలో మహారాష్ట్రలో వెస్ట్‌జోన్ ఎన్ఎస్ఎస్ ప్రీ రిపబ్లిక్ డే పరేడ్‌క్యాంపు-2024 నిర్వహిం చారు.

కార్యక్రమంలో కేయూ మహిళ ఇంజనీరింగ్ కళాశాల ఎన్ఎస్ ఎస్ కోఆర్డినేటర్లు టి. స్వప్న, తూర్పాటి వెంకటేశ్, అధ్యాపకులు వైష్ణవి, సాయి తరుణ్, సురేంద ర్‌నాయక్, వీరునాయక్ తదితరులు పాల్గొన్నారు.

కేయూ సౌత్ జోన్ ఇంటర్ వర్సిటీ జూడో పురుషుల జట్టు ఎంపిక

కేయూ క్యాంపస్, నవంబరు 27, (ఆంధ్రజ్యోతి): నవంబరు 28 నుంచి 30 వరకు భోపాల్‌లోని ఎల్ఎన్‌సీటీ యూనివర్సిటీలో జరిగే సౌత్ జోన్ ఇంటర్ వర్సిటీ జూడో పురుషుల జట్టును 2024-25 ఏడాదికి గాను బుధవారం ఎంపిక చేసినట్లు కేయూ స్పోర్ట్స్ బోర్డు సెక్రటరీ ప్రొఫెసర్ వై.వెంకయ్య తెలిపారు. ఎంపికైన క్రీడాకారులలో ఎఎల్. లక్ష్మణ్, (కాకతీయ ప్రభుత్వ డిగ్రీ కళాశాల, హనుమకొండ), బి.జయదీప్, (సీకేఎం ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల, వరంగల్), ఎం.ముఖేశ్, పి.నాగేంద్ర, (యూనివర్సిటీ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల, సుబేదారి), ఎం.దర్శిత్‌నాయక్(ఎల్‌బీ కళాశాల, వరంగల్), బి.రాహుల్, (కేయూ స్కూల్ ఆఫ్ లర్నింగ్, కేయూ), జే.మహేశ్(వాగ్దేవి డిగ్రీ కళాశాల, కిషన్‌పుర)లున్నట్లు పేర్కొన్నారు. ఈ జట్టుకు కోచ్, మేనేజర్‌గా వాగ్దేవి డిగ్రీ కళాశాల ఫిజికల్ డైరెక్టర్ బి.రాము వ్యవహరిస్తారని తెలిపారు. ఎంపికైన క్రీడాకారులను కేయూ వీసీ ప్రొఫెసర్ కర్నాటి ప్రతాప్‌రెడ్డి, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ పి.మల్లారెడ్డి, డైరెక్టర్ ప్రొఫెసర్ వై.వెంకయ్యలు అభినందించారు.


ఎంపికైన క్రీడాకారులతో డైరెక్టర్ ప్రొఫెసర్ వెంకయ్య తదితరులు

పత్తి రైతులు ఆందోళన చెందొద్దు

వరంగల్ వ్యవసాయం, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): పత్తి రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, మొత్తం పత్తిని సీసీఐ కొనుగోలు చేస్తుందని వరంగల్ బ్రాంచ్ జనరల్ మేనేజర్ అర్జున్ దవే ప్రకటించారు. పత్తి కొనుగోళ్ల కోసం వరంగల్ బ్రాంచ్ పరిధిలో 16 జిల్లాల్లో 54 సీసీఐ కేంద్రాలను ప్రారంభించామని, సమీప కేంద్రాన్ని తెలుసుకోవడానికి, వివరాలు, మద్దతు ధరలు, ఫిర్యాదుల పరిష్కారం కోసం రైతులు 'కాట్-అలై' మొబై ల్ యాప్‌ను డౌన్ లోడ్ చేసుకోవాలని సూచించారు. ఇంకా రైతులకు ఏమైనా ఇబ్బందులుంటే 7718955728కు వాట్సాప్ చేయవచ్చని సూచించారు.

బాదావత్ రాజు అరెస్టు అక్రమం

హనుమకొండ, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): మానవ హక్కుల వేదిక రాష్ట్ర ఉపాధ్యక్షుడు బదావత్ రాజును పోలీసులు అదుపులోకి తీసుకోవడం అక్రమమని మాన వ హక్కుల వేదిక ఒక ప్రకటనలో ఖండించింది. రాజును ఈ నెల 25వ తేదీ అర్ధరాత్రి కేయూసీ పోలీసుస్టేషన్‌కు పిలిపించి నిర్బంధించడంపై మానవ హక్కుల వేదిక రాష్ట్ర అధ్యక్షుడు అత్రం భుజంగరావు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్.తిరుపతయ్య, ఉభయ రాష్ట్రాల సమన్వ య కమిటీ సభ్యుడు ఎస్.జీవన్‌కుమార్ అభ్యంతరం వ్యక్తం చేశారు.

బంజారా హక్కుల పోరాట సమితి నిరసన కార్యక్రమం ప్రకటిస్తే రాజు అదే సామాజిక వర్గానికి చెందినవాడు అయినందున ఆయనను ముందస్తుగా అదుపులోకి తీసుకోవడం అన్యాయమని అభిప్రాయపడ్డారు.

వర్గీకరణ చేయకుండా నియామకాలు చేపట్టొద్దు

ఎమ్మార్పీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రాగల్ల ఉపేందర్

స్టేషన్‌ఘన్‌పూర్, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): ఎస్సీ వర్గీకరణ మాదిగల జన్మ హక్కు అని, ఎస్సీ వర్గీకరణ చేయకుండా రాష్ట్ర ప్రభుత్వం ఉద్యోగ నియామకాలు చేపట్టడం అన్యాయమని ఎమ్మార్పీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రాగల్ల ఉపేందర్ తెలిపారు. బుధవారం మండలంలోని రంగరాయగూడెంలో నిర్వహించిన మాదిగల చైతన్యసభలో ఆయన పాల్గొని మాట్లాడారు. సుప్రీంకోర్టు తీర్పును అనుసరించి ఎస్సీ వర్గీకరణ అమలు చేయడంలో దేశంలోనే తొలి రాష్ట్రంగా నిలబెడతామని అసెంబ్లీ సాక్షిగా హామీ ఇచ్చిన సీఎం రేవంత్‌రెడ్డి ఎస్సీ వర్గీకరణను అమలు చేయకుండా ఉద్యోగాలను భర్తీ చేస్తూ తీవ్ర అన్యాయం చేస్తున్నారని అన్నారు.

డీఎస్సీ, గ్రూపు 1, 2, 3, 4, హెల్త్ డిపార్ట్‌మెంట్ ఉద్యోగాలు, ఏఈ, హాస్టల్ వెల్ఫేర్ ఉద్యోగాలను వర్గీకరణ లేకుండానే చేసి మాదిగలకు తీవ్ర అన్యాయం చేశారని తెలిపారు. సీఎం రేవంత్‌రెడ్డి ఇప్పటికైనా మేలుకొని మాదిగలకు అన్యాయం జరుగకుండా వర్గీకరణను అమలు చేయాలని కోరారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు పైసా రాజశేఖర్, ఎంఎస్‌పీ జిల్లా అధ్యక్షుడు గద్దల కిశోర్, ఎంఎస్‌పీ జిల్లా నాయకుడు మంద శ్రీనివాస్, సందేన రవీందర్, బొట్ల మహేష్, గంధమల్ల ఉదయ్, గాదె శ్రీదర్, గుర్రం నవీన్, మంద ప్రశాంత్, స్వామి తదితరులు పాల్గొన్నారు.

వరంగల్ మార్కెట్ ధరలు

పంట	క్వింటా గరిష్ట	క్వింటా కనిష్ట
మక్కలు (బిల్టీ రకం)	2460	2080
పల్లికాయ (సూక)	4000	4000
పల్లికాయ (పచ్చిది)	---	---
కందులు	6912	8000
పెసళ్లు	5382	5250
పత్తి	6840	5800
కొత్తపత్తి	---	---
పసుపు (కాడి)	---	---
తేజ మిర్చి కొత్తది	14000	12000
తేజ మిర్చి	12000	9000
తేజ ఏసీ	16000	14000
వండర్‌హాట్ ఏసీ	15000	11000
యూఎస్341ఏసీ	14500	11000
దేశీ ఏసీ	---	---
సింగిల్‌పట్టి ఏసీ	---	---
తాలు మిర్చి	8000	3000

- వరంగల్ వ్యవసాయం

టూరిస్టుల రాక పెరుగుతోంది

ఫేస్ టు ఫేస్

శివాజీ, ఉమ్మడి జిల్లా పర్యాటక శాఖ అధికారి



ప్రశ్న: పర్యాటకానికి ప్రభుత్వం నుంచి ప్రోత్సాహం ఎలా ఉంది ?

జ: బాగానే ఉంది. అవసరమైన చోట పర్యాటకుల సౌకర్యార్థం వసతి సౌకర్యాలను, ఇతర మౌలిక సదుపాయాలను ప్రభుత్వం కల్పిస్తోంది.

ప్రశ్న: పర్యాటకుల సంఖ్య గతం కన్నా పెరిగిందా?

జ: రామప్పకు యూనెస్కో గుర్తింపు వచ్చిన తర్వాత ఉమ్మడి జిల్లాకు పర్యాటక రాక గతంలో కన్నా బాగా పెరిగింది. రామప్పతో పాటు ఇతర దర్శనీయ స్థలాలను చూసేందుకు ఎక్కువ మంది వస్తున్నారు.

ప్రశ్న: పర్యాటక స్థలాల అభివృద్ధికి ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారు ? నిధులు ఏమైనా వచ్చాయా ?

జ: రామప్పలో అభివృద్ధి పనులు జరుగు తున్నాయి. లక్నావరంలో మరిన్ని సౌకర్యాల కల్పించాం. కురవి, అయినవోలు, ధర్మసాగర్, వడ్డెపెల్లి, కాళేశ్వరం, ఘనపురం, తదితర ప్రాంతాల్లో పర్యాటకాభివృద్ధికి, ఎకో టూరిజానికి ప్రతిపాదనలు పంపాము. ప్రభుత్వ పరిశీలనలో ఉన్నాయి.

ప్రశ్న: తెలంగాణ దర్శినికి స్పందన ఎలా ఉంది ?

జ: విద్యార్థుల నుంచి మంచి స్పందన ఉంది. ఈ పథకం కింద ఆయా పాఠశాల విద్యార్థులను పర్యాటక ప్రాంతాలకు తీసుకువెళ్లేందుకు కార్య ప్రణాళికను రూపొందించాం.

ప్రశ్న: ఉమ్మడి జిల్లా విదేశీల పర్యాటకుల రాక ఎలా ఉంది ?

జ: గతంలో కన్నా ఈ సారి బాగా పెరిగింది. ఈ సంవత్సరం ఇప్పటికే వివిధ దేశాల నుంచి 400 మందికిపైగా వచ్చారు.

ప్రకృతి అందాల పుట్టిల్లు
కొడవటూరు

- ఆధ్యాత్మికంతో పాటు ఆహ్లాదాన్ని పంచుతున్న సిద్ధులగుట్ట
- పర్యాటక ప్రాంతంగా తీర్చిదిద్దాలంటున్న భక్తులు





ధ్యానం కోసం నిర్మించిన పిరమిడ్

బచ్చన్నపేట, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి) : పురాతన దేవాలయాలంటేనే ఎన్నో ప్రత్యేకతలకు నిలయాలు. అలాంటి పురాతన దేవాలయాల్లో ప్రకృతి అందాలకు పుట్టినిల్లుగా పేరుగాంచిన శైవక్షేత్రం కొడవటూరు స్వయంభూ సిద్ధేశ్వరాలయం ఒకటి. సుమారు 147 ఎకరాల విస్తీర్ణంలో ఉండే ఈ సిద్ధులగుట్ట చుట్టూ పచ్చని చెట్లు, ఔషధ మొక్కల పరిమళాలు వెద జల్లుతాయి. ఆధ్యాత్మికతతో పాటు ఆహ్లాదాన్ని పంచే ఈ క్షేత్రంలో అనేక దేవతామూర్తుల ఆలయాలతో పాటు, మనస్సుకు ప్రశాంతత చేకూర్చే పిరమిడ్ ధ్యాన కేం ద్రం ఉంది. నిత్యం ఇక్కడకు వచ్చే భక్తులకు ఈ ప్రాంత పరి సరాలు ఆహ్లాదాన్ని పంచు తున్నాయి. ఇక్కడి సిద్ధేశ్వ రుడి దర్శనానికి వచ్చే ప్రజా ప్రతినిధులు, రాజకీయ నేతలు.. తన్మయ త్వానికి లోనై ఈ ప్రాంతాన్ని పర్యాటకంగా తీర్చిదిద్దేందుకు నిధులు కేటాయిస్తామంటూ హామీలు ఇస్తుంటారు. కానీ అవేమీ అమలుకు నోచుకోవటం లేదని భక్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



ఆలయంలో సిద్దేశ్వరుడు

అభివృద్ధి చేస్తే భక్త సందోహమే..

సిద్ధులగుట్టను పర్యాటక ప్రాంతంగా అభివృద్ధి చేస్తే భక్తులు, పర్యాటకులతో కిటకిటలాడటం ఖాయమంటున్నారు. దశాబ్ద కాలం క్రితం ఈ గుట్టపై ఉన్న మూడు గుండాల్లో స్నానమాచరించనిదే భక్తులు సిద్ధేశ్వరుడిని దర్శించుకునేవారు కాదు. కింది నుంచి గుట్టపైభాగాన ఉన్న గుండాలు సుమారు కిలోమీటర్ దూరంలో ఉంటాయి. ఉరుకుల పరుగుల జీవితం, అనారోగ్య సమస్యలు చుట్టుముట్టడంతో కాలినడకన గుండాల వద్దకు భక్తులు తక్కువగా వెళుతున్నారు.

గతంలో కొడవటూరు సర్పంచ్‌గా పనిచేసిన గంగం సతీష్‌రెడ్డి గుట్టపైకి వాహనాలు వెళ్లే విధంగా రూట్‌మ్యాప్‌తో పాటు పర్యాటక అభివృద్ధికి సంబంధించిన ప్రణాళికను తయారు చేసి, ఎమ్మెల్యే ఆమోద పత్రంతో దేవాదాయశాఖ అధికారులకు పంపారు. అలాగే గుట్ట కింది భాగంలో ఉన్న చెరువును ట్యాంక్‌బండ్ మాదిరిగా అభివృద్ధి చేయడం.. ఆలయానికి ముందు 30 అడుగుల శివలింగం, హనుమాన్ విగ్రహాలు ఏర్పాటు, ఆలయం వద్ద ఉన్న 6.19 ఎకరాల్లో వాటర్ ఫౌంటేన్లు, ఔషధ, పూల మొక్కల పెంపకం, కోతుల పార్కు, గుట్టచుట్టూ తిరిగేలా సుమారు నాలుగు కిలోమీటర్ల పరిధిలో రోడ్డు, నిర్మించి వదిలేసిన పర్యాటక అతిథి గృహాన్ని వినియోగంలోకి తేవటం లాంటి చర్యలు తక్షణం చేయాలని కోరుతున్నారు. ఇక ఆలయ పరిసరాల్లో వానరాల కారణంగా తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని, వీటిని పట్టి అడవుల్లో వదిలేస్తే ఇబ్బందులు తొలగుతామని భక్తులు సూచిస్తున్నారు.



వరంగల్ రైల్వే స్టేషన్ ప్రాంగణంలో రైల్ కోచ్ రెస్టారెంట్‌కు జరుగుతున్న ఏర్పాట్లు

రైల్ కోచ్ రెస్టారెంట్!

- త్వరలో వరంగల్ రేల్వే స్టేషన్‌లో ఏర్పాటు
- 24 గంటలు అందుబాటులో భోజనం

గిర్మాజిపేట, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): రైలు ప్రయాణికులకు రైల్‌కోచ్ రెస్టారెంట్ అందుబాటులోకి రానుంది. ఇప్పటికే హైదరాబాద్ నెక్లెస్ రోడ్‌లో వివిధ రుచులతో ఆకట్టుకుంటున్న రైల్ కోచ్ రెస్టారెంట్ తరహాలో త్వరలో వరంగల్ రైల్వేస్టేషన్‌లో కూడా ఏర్పాటు చేయాలని రైల్వేశాఖ నిర్ణయించింది. ప్రయాణానికి ఉపయోగపడని రైల్ కోచ్‌లను ఆధునికీకరించి రెస్టారెంట్లుగా ఏర్పాటు చేసేందుకు తీర్చిదిద్దుతోంది. ఇప్పటికే కాచిగూడ రైల్వేస్టేషన్ ప్రాంగణంలో రెస్టారెంట్ ఆన్ వీల్స్ పేరుతో తొలి రైల్ కోచ్ క్యాంటీన్ ఏర్పాటుచేసిన అధికారులు రెండో రైల్ కోచ్ రెస్టారెంట్‌ను గత సెప్టెంబరు 11న నెక్లెస్ రోడ్‌లో ప్రారంభించారు. అదే రీతిలో వరంగల్ రైల్వేస్టేషన్ ప్రాంగణంలోని ఐవోడబ్ల్యూ కార్యాలయం సమీపంలో రైల్ కోచ్ రెస్టారెంట్‌ను ఏర్పాటు చేసేందుకు రంగం సిద్ధం చేశారు. ఈ రెస్టారెంట్ 24గంటలు అందుబాటులో ఉండనుంది. దీనికి సంబంధించిన కాంట్రాక్ట్‌ను వరంగల్ నగరంలోని ప్రముఖ హోటల్ అయిన శంకర్ విలాస్ యాజమాన్యం పొందింది. రైల్ కోచ్‌ను ఆధునికీకరించే పనులను బుధవారం ప్రారంభించింది. నూతన సంవత్సరం నాటికి ప్రజలకు అందుబాటులోకి తెస్తామని నిర్వాహకులు తెలిపారు.



వరంగల్‌లో రెస్టారెంట్ ఏర్పాటు చేయనున్న రైల్వే కోచ్





నెక్లెస్ రోడ్డులోని రైల్ కోచ్ రెస్టారెంట్ ఇదే, సుందరీకరించిన లోపలిభాగం

నారీ శక్తి

పల్నాడు గడ్డపై..



ప్రత్యర్థుల దాడిలో నుదుటిపై లోతైన గాయమైనా.. రక్తం ధారలా కారుతున్నా.. ధైర్యాన్ని కోల్పోలేదు. తాను నమ్మిన పార్టీ కోసం, రాజకీయ సిద్ధాంతం కోసం ప్రత్యర్థులను ఎదిరించి వార్తల్లో నిలిచారు. ఆమె ఎవరో కాదు. ఏపీలోని పల్నాడు జిల్లా రెంటచింతల మండలం రెంటాల గ్రామానికి చెందిన చెర్రెడ్డి మంజులారెడ్డి. తెలుగుదేశం పార్టీ సాధారణ కార్యకర్తగా ఉన్న ఆమె అసెంబ్లీ ఎన్నికల పోలింగ్ నాటి ఘటన తర్వాత ప్రత్యేక గుర్తింపు పొందారు. అంతేకాదు పార్టీ అధినేత, ఏపీ సీఎం చంద్రబాబు దృష్టిలో పడిన ఆమె సాధారణ మహిళా నాయకురాలి నుంచి ఏపీ శిల్పారామం, హస్తకళల అభివృద్ధి సంస్థ చైర్‌పర్సన్‌గా బాధ్యతలు స్వీకరించే స్థాయికి ఎదిగారు. అలా ఏపీ రాజకీయాల్లో 'వీరవనిత'గా పేరు తెచ్చుకున్న మంజులారెడ్డి ఓరుగల్లు ఆడబిడ్డ కావడం గమనార్హం. భద్రకాళి అమ్మవారు వెంచేసిన నేలపై పుట్టిన మంజులారెడ్డి.. రాణీ రుద్రమదేవి పౌరుషాన్ని.. సమ్మక్క సారలమ్మ పోరాట తెగువను పల్నాటి గడ్డపై చూపారు.

ఓరుగల్లు పౌరుషం



ఏపీ శిల్పారామం, హస్తకళల అభివృద్ధి సంస్థ చైర్‌పర్సన్‌గా బాధ్యతలు స్వీకరిస్తున్న మంజులారెడ్డి

- ఏపీ అసెంబ్లీ ఎన్నికల పోరులో ప్రత్యర్థులను ఎదిరించిన చల్లగరిగ ఆడబిడ్డ
- గొడ్డలి గాయమైనా వెనుకడుగేయని మంజులారెడ్డి
- అధినేత ఆశీస్సులతో 'దేశం'లో కీలక నేతగా గుర్తింపు
- ఏపీ శిల్పారామం, హస్తకళల అభివృద్ధి సంస్థ చైర్‌పర్సన్‌గా ప్రమాణం

హనుమకొండ, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి) : చెర్రెడ్డి మంజులా రెడ్డి.. ఈ ఏడాది మే 13న ఏపీ అసెంబ్లీ ఎన్నికల పోలింగ్ రోజున వార్తల్లో నిలిచిన మహిళ. పల్నాడు జిల్లా మాచర్ల నియోజవర్గం రెంటచింతల మండలం రెంటాల గ్రామానికి చెందిన ఆమె తెలుగుదేశం పార్టీ తరఫున పోలింగ్ బూత్ ఏజెంట్‌గా కూర్చుని.. ప్రత్యర్థి పార్టీ వైసీపీ వారి దాడికి గురయ్యారు. ఆ సమయంలో ఆమె నుదుటిపై గొడ్డలి వేటు కారణంగా లోతైన గాయమైంది. రక్తమోడుతున్నా ధైర్యం కోల్పోకుండా ఆమె ఏజెంట్‌గా తన బాధ్యతను నిర్వర్తించి వీర వనితగా వార్తల్లో నిలిచారు.

అలా పార్టీ కోసం కట్టుబడిన ఆమె ధైర్యాన్ని మెచ్చుకున్న టీడీపీ అధినేత, ఏపీ సీఎం చంద్ర బాబు సాధారణ నాయకురాలిగా ఉన్న ఆమెను ఏపీ శిల్పా రామం, హస్తకళల అభివృద్ధి సంస్థ చైర్‌పర్సన్‌గా నియమించి.. ప్రత్యేక గుర్తింపునిచ్చారు. అంతలా పార్టీ కోసం ప్రాణాలను కూడా లెక్కచేయకుండా ప్రత్యర్థులకు ఎదురొడ్డి నిలిచిన మంజులారెడ్డి పుట్టిపెరిగింది ఉమ్మడి వరంగల్ జిల్లాలోనే. మెట్టినింట తెలంగాణ పౌరుషాన్ని, రాణిరుద్రమదేవి ధీరత్వాన్ని ప్రదర్శించిన మంజులారెడ్డి ఇటీవల ఏపీ శిల్పారామం, హస్తకళల అభివృద్ధి సంస్థ చైర్ పర్సన్‌గా బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆ వరంగల్ ఆడపడుచు.. తనకు ఓరుగల్లు నేలతో ఉన్న అనుబంధాన్ని 'ఆంధ్రజ్యోతి'తో పంచుకున్నారు.

నేను చల్లగరిగె ఆడపడుచును..

నా స్వస్థలం ప్రస్తుత జయశంకర్ భూపాలపల్లి జిల్లా చిట్యాల మండలం చల్లగరిగే గ్రామం. చల్లగరిగే అనగానే గుర్తొచ్చేది ప్రముఖ పాట రచయిత, ఆస్కార్ అవార్డు గ్రహీత చంద్రబోస్. ఆయనది, మాదీ ఒకే గ్రామం. నాన్న మోర్తాల బూసిరెడ్డి, అమ్మ అన్నపూర్ణ. మాది పెద్ద కుటుంబం. ఏడుగురు సంతానం. ఒక అన్న, ఆరుగురు అక్కలు. అం దరికన్నా నేనే చిన్నదానిని. నా బాల్యమంతా పచ్చని పొలా లు, మట్టి మనుషుల మధ్య గడిచింది. చదువు కూడా చల్లగ రిగలోని ప్రభుత్వ పాఠశాలలోనే సాగింది. చిన్నతనంలో ఎం తో అల్లరి చేసిన నేను ఆటల పోటీల్లో ఎప్పుడూ ముందుం డేదాన్ని. దేనికీ భయపడని మనస్తత్వాన్ని నాకు పల్లె వాతావరణమే నేర్పింది. ఏడుగురు సంతానంలో చిన్నదాన్ని కావడంతో అందరూ గారాబంగా చూశారు. కానీ పెళ్లి కారణంగా పదోతరగతితోనే చదువు ఆపేయాల్సి వచ్చింది.

ఆంధ్రా సం'బంధం' ఎలాగంటే..

పక్కా తెలంగాణలో పుట్టిన నాకు ఆంధ్రాతో బంధం ఏర్ప డటానికి మా దగ్గర బంధువైన వేణుగోపాల్ రెడ్డి కారణం. యాదాద్రి భువనగిరి జిల్లా ఆలేరుకు చెందిన వేణుగోపాల్‌రెడ్డి ఆర్‌ఎంపీగా ఆంధ్ర ప్రాంతంలో కూడా వైద్యం చేస్తుండేవారు. ఈ క్రమంలో ఆయన అక్కడ అమ్మాయిని వివాహం చేసుకోవడంతో ఏర్పడిన పరిచయాలు, బంధుత్వాలతో నాకు ఆ పల్నాడు జిల్లా రెంటాల గ్రామానికి చెందిన చెర్రెడ్డి కోటిరెడ్డితో వివాహమైంది. నా భర్త కోటిరెడ్డి టీడీపీ నాయకుడిగా గతంలో పంచాయతీ ఎన్నికల్లో పోటీ చేసి వైసీపీ వారి ఆరాచకాలను ఎదిరించి సర్పంచ్‌గా గెలిచారు. అప్పుడు నాకు అంతగా రాజకీయాలంటే ఇష్టం లేకపోయినా ఓ సాధారణ మహిళా కార్యకర్త గా నా భర్త తరఫున ప్రచారం చేశా. కానీ గత ఐదేళ్లలో వైసీపీ శ్రేణుల ఆరాచకాలను చూసి నాకు బాధేసింది. కోపం కూడా వచ్చేది. కానీ సంయమనం పాటించా. ఆ తర్వాత అసెంబ్లీ ఎన్నికల సమయంలో మాచర్ల నియోజకవర్గంలో నా భర్త, ఇతర మహిళా నాయకులతో కలిసి ప్రచారంలో పాల్గొన్నా. క్రియాశీలకంగా వ్యవహరించా. చివరకు పోలింగ్ రోజున మా గ్రామంలోని పోలింగ్ బూత్‌లో టీడీపీ ఏజెంట్‌గా కూర్చున్నా. కానీ వైసీపీ వారు దుర్మార్గానికి దిగారు. టీడీపీ తరఫున ఏజెంట్లు లేకుండా చేసేందుకు ప్రయత్నించారు. ఆక్రమంలోనే వైసీపీ వర్గీయులు నాపై దాడి చేశారు. రోడ్డుపై పడేసి గొడ్డళ్లతో గాయపరిచారు. అయినా వెనక్కి తగ్గకుండా నుదుటన గొడ్డలి గాటు పడినా.. రక్తం కారుతున్నా బూత్‌లోనే కూర్చుని వైసీపీ రిగ్గింగ్‌ను అడ్డుకున్నా. పోలింగ్ పూర్తయ్యాక ఆస్పత్రికి వెళ్లి చికిత్స తీసుకున్నా. నాలా కష్టపడే సాధారణ కార్యకర్తకు టీడీపీలో సముచిత స్థానం లభిస్తుందనడానికి.. ఓ కీలకమైన కార్పొరేషన్‌కు సీఎం చంద్రబాబు నన్ను చైర్‌పర్సన్‌గా నియమించడమే ఉదాహరణ.

ఓరుగల్లు పౌరుషం నారక్తంలోనే ఉంది

మెట్టినిల్లు ఆంధ్రా అయినా నా రక్తంలోనే ఓరుగల్లు పౌరుషం ఉంది. ఆ తెగింపుతోనే నేను వైసీపీ మూకలను ఎదుర్కోగలిగా. నేను ఏ స్థాయిలో ఉన్నా పుట్టినిల్లయిన చల్లగరిగె.. ఉమ్మడి ఓరుగల్లుతో నా అనుబంధం కొనసాగుతూనే ఉంటుంది. ఇప్పటికీ చల్లగరిగెకు రాకపోకలు సాగుతూనే ఉన్నాయి. వరంగల్, నెక్కొండ, రాఘవాపూర్, శనిగరంలో బంధువులు ఉన్నారు. తెలంగాణ పౌరుషం.. రాణి రుద్రమదేవి ఇచ్చిన ధీరత్వమే నన్ను నడిపిస్తోంది.. ఆటైనా పాటైనా, పోరాటమైనా అన్నిటా ముందు నిలిచేలా నా పుట్టినూరు చల్లగరిగే చైతన్యం నింపింది. ప్రస్తుతం హస్తకళల అభివృద్ధి సంస్థ చైర్మన్‌గా బాధ్యతల స్వీకరించిన తర్వాత నేను రాజకీయాల్లో మరింత క్రియాశీలంగా ఉండాలనుకుంటున్నా. వీలైనంత మేరకు ప్రజలకు సేవ చేయాని నిర్ణయించుకున్నా. చల్లగరిగె ఆడబిడ్డగా పల్నాడు రాజకీయాల్లో నాదైన ముద్ర వేయాలనుకుంటున్నా.

పరిమళించిన పల్లె చిత్రం

- ఆర్ట్స్ ఫొటోగ్రఫీలో రాణిస్తున్న ఫక్రుద్దీన్
- పేదరికాన్ని జయించి.. అవార్డుల వైపు నడుస్తున్న మరిపెడ వాసి
- సామాజిక సేవలోనూ తనవంతు పాత్ర

మరిపెడ, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి) : పుట్టింది పేద కుటుంబంలో అయినా తనకున్న ప్రతిభను ప్రపంచానికి చూపాడు. ఆర్ట్ ఫొటోగ్రఫీలో రాణించి గోల్డ్ మెడల్ సంపాదించాడు. పలు రాష్ట్ర, జాతీయ, అంతర్జాతీయ స్థాయి ఫొటోగ్రఫీ పోటీల్లో సత్తా చాటి ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్నాడు. అంతేకాదు ఫొటోగ్రఫీలో తాను సంపాదించే మొత్తంలో నుంచి కొంత సొమ్మును సామాజిక సేవలకు వినియోగిస్తూ ఆదర్శంగా నిలుస్తున్నాడు.. మరిపెడ బంగ్లాకు చెందిన ఫక్రుద్దీన్. ప్రకృతి రమణీయ ఫొటోల చిత్రీకరణ ఫక్రుద్దీన్ హాబీ. అయితే కమర్షియల్ ఫొటోగ్రాఫర్‌గా జీవనాన్ని ఆరంభించిన ఫక్రుద్దీన్ ఖమ్మం జిల్లా తిరుమలాయపాలెం మండలం బీరోలులో జన్మించారు. ఏడో తరగతి వరకు చదివారు. నిరుపేద కుటుంబం కావడంతో ఇరవైయేళ్ల క్రితం జీవనోపాధి కోసం మరిపెడబంగ్లాకు వలస వచ్చి టైలరింగ్ వృత్తిలో స్థిరపడ్డారు. ఈ క్రమంలో ఫొటోగ్రఫీపై మక్కువ పెంచుకున్న ఫక్రుద్దీన్ టైలరింగ్ వృత్తిని ఫొటోగ్రాఫర్‌గా మారి ఆర్ట్ ఫొటోలపై మక్కువ పెంచుకొని అనతి కాలంలోనే రాష్ట్ర, జాతీయ, అంతర్జాతీయ పోటీల్లో తనదైన శైలిని ప్రదర్శిస్తూ అనేక బంగారు, రజత, కాంస్య పతకాలను సాధించారు.

ఫొటోగ్రఫీలోని కొత్త ఒరవడులకు నాంది పలికిన ఫక్రుద్దీన్ నేటి ఫొటోగ్రాఫర్లకు మార్గదర్శకుడిగా నిలిచారు. మరిపెడ మండల ఫొటో, వీడియో గ్రాఫర్స్ అసోసియేషన్ ఏర్పాటు చేసి రాష్ట్రంలోనే మరిపెడ ఫొటోగ్రాఫర్స్ అసోసియేషన్‌కు ఓ ప్రత్యేక గుర్తింపు తీసుకొచ్చారు. ఫొటోగ్రాఫర్లకు డ్రెస్ కోడ్‌కు బీజం వేశారు. ఎప్పటికప్పుడు ఫొటోగ్రఫీలో మెళకువలను నేర్చుకుంటూ సాధన చేస్తూ ఆర్ట్ ఫొటోలను బంధించి రాష్ట్ర, జాతీయ, అంతర్జాతీయ పోటీల్లో సత్తా చాటుతున్నారు.

సామాజిక సేవలోనూ..

ఫక్రుద్దీన్ తను బతుకు దానికి కమర్షియల్ ఫొటోగ్రాఫర్‌గా ఎదిగి, ఓ వైపు ఆర్ట్ ఫొటోగ్రఫీలో రాణిస్తూనే సామాజిక సేవలో తనకు సరిలేరెవ్వరని నిరూపించుకుంటున్నారు. వరంగల్ రెడ్‌క్రాస్ సంస్థ ద్వారా రక్తదాన శిబిరాన్ని మరిపెడబంగ్లాలో ఏర్పాటు చేయించి వందల యూనిట్ల రక్తాన్ని ఫొటోగ్రాఫర్ల ద్వారా రెడ్‌క్రాస్‌కు అందచేసి అప్పటి ఉమ్మడి వరంగల్ కలెక్టర్ ఆమ్రపాలి చేతుల మీదుగా ప్రశంస పత్రాన్ని అందుకున్నారు. అలాగే పలు సేవా కార్యక్రమాల్లో పాలు పంచుకుంటున్నారు.







(ఫైల్) కలెక్టర్ చేతుల మీదుగా ప్రశంసా పత్రం అందుకుంటున్న ఫక్రుద్దీన్



పతకాల పంట..

ఫక్రుద్దీన్‌కు ఆర్ట్ ఫొటోగ్రఫీలో పతకాల పంట పండింది. ఇప్పటి వరకు 10 బంగారు పతకాలు, 4 బ్రాంజ్ మెడల్స్, 15ఎఫ్ఐపీ రిబ్బన్స్ సాధించారు. దాంట్లో భాగంగా ఫెడరేషన్ ఆఫ్ ఇండియన్ ఫొటోగ్రఫీలో ఆర్టిస్ట్ ఎఫ్ఐపీ డిస్టంక్షన్ పొందారు. అలాగే ఫెడరేషన్ మల్టీ కల్చరల్ ఫొటోగ్రఫిక్ ఆర్ట్ అమెరికా గౌరవ ఎక్స్‌లెన్స్ హానర్‌ను సాధించారు. ఈ మెడల్ డిసెంబరు 1న ఆయనకు ఆ సంస్థ విజయవాడలో అందజేయనుంది. ఇవే కాక మరో రెండు బంగారు పతకాలు దక్కించుకున్నారు. ఫెడరేషన్ ఆఫ్ ఇంటర్నేషన్ ఎఫ్ఐఏపీ డీఎల్ ఆర్ట్ క్రియేషన్స్‌లో గోల్డ్ మెడల్ సాధించారు. దేశంలోని వివిధ ప్రాంతాల్లో అనేక సంస్థలు నిర్వహించిన పలు పోటీల్లో పాల్గొని మరో ఐదు ఆవార్డు దక్కించుకున్నారు. మొట్టమొదటగా తెలుగు రాష్ట్రాల్లోని రాచకొండ ఫొటోగ్రఫీ పోటీల్లో పాల్గొని నగదు పారితోషికంతో పాటు సిల్వర్ మెడల్ సొంతం చేసుకున్నారు. కేరళ రాష్ట్రంలోని ఓ పోటీల్లో పాల్గొని బెస్ట్ అవార్డు అందుకున్నారు.



ఫక్రుద్దీన్ అందుకున్న పతకాలు



సైకిల్ కనుమరుగు.. ఉపాధి దేవుడెరుగు..

ఒకప్పుడు సైకిల్ అంటే సామాజిక హోదా. సైకిల్ ఉందంటే సమజాంలో ఓ గౌరవం ఉండేది. ఏ పనికి వెళ్లాలన్నా సైకిల్‌నే ఉపయోగించేవారు. అంతెందుకు పెళ్లి కుదిరిందంటే వధువు తల్లిదండ్రులు వరుడికి వరకట్నాల కింద సైకిల్, గడియారం లాంటి పెట్టేవారు. ఇక ఆ రోజుల్లో సైకిల్ ట్యాక్సీలు కూడా ఉండేవి. దాంతో నాడు సైకిల్ అద్దెకిచ్చే దుకాణాలు, పంక్చర్ షాపులు ఉండేవి. కానీ ఇప్పుడు వాహనాల వాడకం పెరగడంతో సైకిల్ తొక్కేవారి సంఖ్య బాగా తగ్గింది. ఒక వేళ వందలో ఒకరో ఇద్దరో సైకిల్ వినియోగించినా.. అవి కూడా ట్యూబ్‌లెస్ టైర్లవే ఉంటున్నాయి. దీంతో పంక్చర్ షాపుల వారికి ఉపాధి తగ్గిపోయింది. దాంతో వారిలో చాలామంది బైకుల టైర్లకు పంక్చర్లు వేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. ఎంతైనా ఒకప్పటిలా గిరాకీ ఉండటం లేదని, తమ ఉపాధి ఎలాగో ఆ దేవుడికే తెలియాని పంక్చర్ షాపు వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇదిగో ఇలా.. నాటి జ్ఞాపకాలను గుర్తు చేసుకుంటూ.. ఉపాధి కోసం ఎదురుచూస్తున్నారు. వర్ధన్నపేట మండలంలోని ఇల్లంద గ్రామంలో చిన్న పాటి పంక్చర్ షాపును నిర్వహిస్తున్న ఈ మెకానిక్ గిరాకీ కోసం ఎదురు చూస్తూ కనిపించాడు.

- వర్ధన్నపేట రూరల్, ఆంధ్రజ్యోతి

సంక్షిప్త వార్తలు

'గుండెపుడి మీదుగా ఆర్టీసీ బస్సు నడపాలి'

మరిపెడ రూరల్, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి) : మహబూబాబాద్ డిపో బస్సులు గుండెపుడి మీదగా సూర్యాపేటకు నడపాలని డిపో మేనేజర్ శివప్రసాద్‌కు వినతిపత్రం అందజేసినట్లు సీపీఎం మండల కార్యదర్శి గుండగాని మధుసూదన్ తెలిపారు. బుధవారం గుండెపుడిలో ఆయన మాట్లాడారు. గుండెపుడి హైస్కూల్‌లో సుమారు 55మంది బుర్హాన్‌పురానికి చెందిన విద్యార్థులున్నారు. పాఠశాలకు రావాలన్నా, పోవాలన్నా వారు ఇక్కట్లు పడుతున్నారన్నారు. జిల్లా కేంద్రానికి వెళ్లడానికి ప్రజలు అవస్థలు పడాల్సి వస్తోందన్నారు. బస్సు పునరుద్ధరణ జరగకపోతే ఉద్యమాలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. బాణాల రాజన్న, లక్ష్మయ్య, రమేష్, రాజశేఖర్ పాల్గొన్నారు.

ఎరువుల విక్రయానికి రశీదు తప్పని సరి

దంతాలపల్లి, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): రైతులకు ఎరువులు, విత్తనాల విక్రయంలో ఫర్టిలైజర్ షాపుల యాజమాన్యం తప్పక రశీదులను ఇవ్వాలని మండల వ్యవసా యాధికారి వాహిని అన్నారు. బుధవారం దంతాలపల్లిలో ఆమె మాట్లాడుతూ యాసంగి సాగులో రైతులకు విక్రయించిన సీడ్స్, ఎరువులు, పెస్టిసైడ్స్ వివరాలను షాపుల వారు రిజిష్టర్లలో నమోదు చేసుకోవాలన్నారు. ప్రభుత్వం నిర్ణయించిన ధర కంటే అధిక రేట్ విక్రయిస్తే చర్యలు తప్పదన్నారు. స్థానికంగా పని చేసే ఏఈవోలు అప్రమత్తంగా ఉండి ప్రజలకు అందుబాటులో ఉండాలన్నారు. ఏఈవోలు దిక్షిత్, శిరీష, ఉదయ్ పాల్గొన్నారు.

ఎస్సీ హాస్టల్‌ను తనిఖీ చేసిన డీఎల్పీవో

దంతాలపల్లి, నవంబరు27 (ఆంధ్రజ్యోతి): పెద్దముప్పారంలోని ఎస్సీ హాస్టల్‌ను బుధవారం డీఎల్పీవో పుల్లారావు ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కలెక్టర్ ఆదేశాల మేరకు వసతి గృహాల్లో మండల సంబంధిత అధికారులచే తనిఖీలు నిర్వహిస్తున్నామన్నారు. విద్యార్థులకు మెను ప్రకారం తాజా కూరగాయలు, భోజనంను అందించాలన్నారు. చలికాలంలో వేడివేడి ఆహారాన్ని సకాలంలో ఇవ్వాలన్నారు. విద్యార్థుల పట్ల అలసత్వం వహిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో వివేక్‌రాం, ఎంపీవో మహ్మద్ అప్సరపాష, పంచాయతీ కార్యదర్శి వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

టీపీసీసీ అధ్యక్షుడి సన్మానానికి తరలిరావాలి

మహబూబాబాద్ టౌన్, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి) : హైదరాబాద్ గాంధీభవన్‌లో ఆదివాసీ కాంగ్రెస్ ఆధ్వర్యంలో ఈనెల 29న ఉదయం 11 గంటలకు జరుపతలపెట్టిన టీపీసీసీ నూతన అధ్యక్షుడు బి.మహేష్‌కుమార్‌గౌడ్ సన్మానోత్సవానికి పెద్ద సంఖ్యలో తరలిరావాలని కాంగ్రెస్ ఎస్టీ సెల్ రాష్ట్ర కోఆర్డినేటర్ గుగులోతు వెంకట్‌నాయక్, జిల్లా అధ్యక్షుడు బోడ రవినాయక్ బుధవారం ఒక ప్రకటనలో విజ్ఞప్తి చేశారు. ఆదివాసీ కాంగ్రెస్ రాష్ట్ర చైర్మన్, ట్రైకార్ చైర్మన్ తెజావత్ బెల్లయ్యనాయక్ ఆధ్వర్యంలో జరిగే ఈ కార్యక్రమానికి అన్ని మండలాలల నుంచి ఎస్టీ సెల్ నేతలు, గిరిజన ప్రజాప్రతినిధులు, గిరిజనులు హాజరుకావాలని పిలుపునిచ్చారు.

గోపాలపురంలో చర్చి నిర్మాణానికి భూమిపూజ

గార్ల నవంబరు 27(ఆంధ్రజ్యోతి) : గోపాలపురంలో కల్వరి విజయం ప్రార్థన మందిరానికి బుధవారం సంఘస్తులు భూమిపూజ నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక సంఘ కాపరి ఆరవ అనసీయ అహోషిక్తులు ఆర్. స్టీఫెన్ మాటాడారు. దైవమందిర నిర్మాణానికి సంఘస్తులు తమవంతు సహాయ సహకారాలు అందించాలన్నారు. కాంగ్రెస్ మండల అధ్యక్షుడు దనియాకుల రామారావు, పోదిల వెంకటేశ్, మీగడ వీరబాబు, ఎర్రబోయిన ఉపేందర్, నాగేశ్వరరావు, నరేష్, సేవకులు, పాల్గొన్నారు.

కేజీబీవీ విభాగం టీఎస్ యూటీఎఫ్

జిల్లా నూతన కమిటీ


షేక్ మున్నీ


స్వరూప

మహబూబాబాద్ ఎడ్యుకేషన్, నవంబరు 27 : జిల్లా కస్తూర్బాగాంధీ బాలికా విద్యాల య విభాగం టీఎస్-యూటీఎఫ్ నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు జిల్లా ప్రధాన కార్యదర్శి యాకూబ్ తెలిపారు. మహబూబాబాద్‌లో బుధవారం నిర్వహించిన కేజీబీవీ ఉపాధ్యాయ, ఉద్యోగుల సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో జిల్లా అధ్యక్షురాలుగా ఎన్.స్వరూప, ప్రధానకార్యదర్శిగా షేక్‌మున్నీ, కోశాధికారిగా బి.జ్యోతి, ఉపాధ్యక్షులుగా శారద, విజయ, నీలిమా, సాల్మ్య, స్వప్న, వసంత, శ్రీలత, కార్యదర్శులుగా స్వర్ణలత, విమల, రజిత, పార్వతి, రమాదేవి, కల్పన, లలితలను ఎన్నుకున్నట్లు తెలిపారు.

సీసీ రోడ్డు పనులు షురూ

ఇనుగుర్తి, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి) : ఇనుగుర్తి నుంచి అన్నారం వెళ్లే రోడ్డు మార్గంలో రాజ్యసభ సభ్యుడు వద్దిరాజు రవిచంద్ర రూ.10లక్షల నిధులతో మంజూరు చేసిన సీసీ రోడ్డు పనులను బుధవారం స్థానిక నాయకులు ప్రారంభించారు. ఎంపీ సోదరుడు వద్దిరాజు దేవేందర్, పీఆర్ డీఈ రాంబాబు, సొసైటీ చైర్మన్ ధీకొండ వెంకన్న, మాజీ సర్పంచ్ దార్ల రాంమూర్తి, బీఆర్ఎస్ గ్రామ పార్టీ అధ్యక్షుడు బేతమల్ల చంద్రయ్య, గండు నాగన్న పాల్గొన్నారు.

బాప్‌రే.. ఇగం

- రోజురోజుకూ పెరుగుతున్న చలితో వణుకుతున్న జనం


కేసముద్రంలో రగ్గులు కొనుగోలు చేస్తున్న ప్రజలు

మహబూబాబాద్ టౌన్, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో వాతావరణంలో మార్పులు చోటు చేసుకుంటున్నాయి. రోజురోజుకూ ఉష్ణోగ్రతలు పడిపోతోండటంతో చలిపెరుగుతోంది. దీంతో ప్రజలు గజగజ వణికిపోతున్నారు. బంగాళఖాతంలో ఏర్పడిన అల్పపీడనంతో ఒక్క సారిగా వాతావరణం చల్లబడడంతో మహబూబాబాద్ జిల్లాలో చలితీవ్రత పెరిగిపోయింది.

ఈ సంవత్సరం శీతాకాలం ఆరంభం నుంచి ఎన్నడు లేని విధంగా ఉష్ణోగ్రతలు తగ్గు ముఖం పడుతున్నాయి. ఈ క్రమంలో చలి పంజా విసరడంతో జనం విలవిల్లాడుతున్నారు. ఇప్పటికే ప్రజలు స్వెటర్లు కొనుగోలు చేసి ధరిస్తున్నారు. తెల్లవారుజాము నుంచి సాయంత్రం వరకు వాతావరణం పూర్తిగా చల్లబడడంతో ప్రతి ఒక్కరు స్వెటర్లు ధరించి కన్పించారు. ఉదయాన్నే పాఠశాలలకు వెళ్లే విద్యార్థులు, విధులకు వెళ్లే ఉద్యోగులు, రైతులు ఉన్ని దుస్తులు ధరించి వెళ్లారంటే చలి తీవ్రత ఎంతగా ఉందో అర్థమవుతోంది.

తాజాగా బుధవారం జిల్లాలో 13.3 డిగ్రీల కనిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదు కాగా, గరిష్టంగా 33.8 డిగ్రీలు నమోదయ్యాయి. చిన్నారులు, వృద్ధులు చలికి తట్టుకోలేక పోతున్నారు. చలిబారీన పడకుండ వారు తగు జాగ్రత్తలు తీసుకోవాలని వైద్యులు సూచిస్తున్నారు.


కేసముద్రంలో చలిమంట కాగుతున్న స్థానికులు

వ్యాధుల దాడి..

చలి కారణంగా జ్వరంపై వంటి దద్దుర్లు రావచ్చు. దగ్గు రావడం, ముక్కుకారడం, శ్వాస సంబంధిత సమస్యలు, గొంతునొప్పి, తుమ్ములు వంటి తదితర వ్యాధులు వచ్చే అవకాశాలున్నాయి. ఇలాంటి లక్షణాలున్న ఉన్న చిన్నారులు ఊరితిత్తుల్లో ఇన్ఫెక్షన్ ఏర్పడి నిమోనియా బారిన పడే అవకాశం ఉంది. గాలిద్వారా సూక్ష్మజీవులు, శరీరంలో ప్రవేశించి, తెల్ల రక్తకణాలు నిర్వీర్యం చేయడంతో రోగ నిరోధక శక్తి తగ్గుతుందని వైద్యులు చెబుతున్నారు.

తీసుకోవాల్సిన జాగ్రత్తలు..

చిన్నపిల్లలు వెచ్చగా ఉండడానికి స్వెటర్లు వేసి చెవులకు వెచ్చదనం కోసం టోపీలు పెట్టాలి. వీలైతే కాళ్లకు, చేతులకు సాక్సులు, గ్లౌస్‌లు వేయాలి. నెలల వయసుగల పిల్లలను తల్లి పొత్తిళ్లలో పడుకోబెట్టుకోవాలి. ఉదయం పూట ఎండలో ఉంచాలని, చిన్నారులతో ఉదయం ప్రయాణాలు చేయొద్దని, రాత్రి వేళల్లో చల్లగాలి రాకుండా ఇంటి కిటికీలు, తలుపులు మూసి వేసి వెచ్చదనం కోసం వేడినిచ్చే హైవోల్టేజ్ బల్బులు వేయాలి. ఏసీలు, కూలర్లు, ఫ్యాన్లు వాడకూడదు. కాచి చల్లార్చిన నీటిని తాగించాలి, వేడివేడి ఆహార పదార్థాలను తినిపించాలని వైద్యులు సూచిస్తున్నారు.

చలికాలం జాగ్రత్తలు తీసుకోవాలి మురళీధర్, డీఎంఅండ్‌హెచ్‌వో

చలి తీవ్రత క్రమంగా పెరుగుతోంది. ఉష్ణోగ్రతలు పడిపోతున్నాయి. రాత్రి వేళ పొగమంచుతో కూడిన గాలులు వీస్తున్నాయి. రానున్న రోజుల్లో చలి తీవ్రత పెరిగే అవకాశం ఉన్నందున చిన్నారులు, వృద్ధులు జాగ్రత్తలు తీసుకోవాలి. ముఖ్యంగా జలుబు, దగ్గు, జ్వరం, శ్వాస సంబంధిత సమస్యలు ఏర్పడే ప్రమాదముందని ఈ నేపథ్యంలో వృద్ధులు, చిన్నారులు ఆరోగ్యం విషయంలో తగు జాగ్రత్తలు పాటించాలి.

తేదీ	కనిష్ఠ ఉష్ణోగ్రతలు	గరిష్ఠ ఉష్ణోగ్రతలు
నవంబరు 22	12.6 డిగ్రీలు	33.3 డిగ్రీలు
నవంబరు 23	12.4 డిగ్రీలు	33.3 డిగ్రీలు
నవంబరు 24	13.6 డిగ్రీలు	33.7 డిగ్రీలు
నవంబరు 25	13.2 డిగ్రీలు	33.4 డిగ్రీలు
నవంబరు 26	14.0 డిగ్రీలు	33.0 డిగ్రీలు
నవంబరు 27	13.3 డిగ్రీలు	33.8 డిగ్రీలు

'వైద్యులు రోగులకు అందుబాటులో ఉండాలి'


పల్లె దవాఖానాలో రికార్డులను పరిశీలిస్తున్న ఎన్‌సీడీ ప్రోగ్రాం ఆఫీసర్ నాగేశ్వర్‌రావు

మహబూబాబాద్ రూరల్, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి) : డాక్టర్లు రోగులకు అందుబాటులో ఉంటూ.. మెరుగైన వైద్య సేవలందించాలని జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ ఎన్‌సీడీ ప్రోగ్రాం ఆఫీసర్ నాగేశ్వర్‌రావు అన్నారు. మహబూబాబాద్ మండలం పర్వతగిరి పల్లె దవాఖానా (ఆయుష్మాన్ దవాఖాన)ను బుధవారం అకస్మికంగా తనిఖీ చేశారు. అనంతరం దవాఖానాలోని రికార్డులను పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ వ్యాధి నిరోధక టీకాల కార్యక్రమం సికిల్‌సెల్‌తో పాటు అభ పని విధానంపై తగిన సూచనలు చేశారు. ప్రజలు వైద్య సేవల కోసం ఆయుష్మాన్ సెంటర్‌కు వస్తున్నారని, వైద్యులు సమయపాలన పాటించాన్నారు. కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ గోవర్ధన్, హెల్త్ సూపర్‌వైజర్ పద్మ, శ్రీనివాస్, కిశోర్, సరిత, పూజా, రమ పాల్గొన్నారు.


డోర్నకల్ కేజీబీవీలో నిరసన తెలుపుతున్న ఉపాధ్యాయినులు


నెల్లికుదురులో కస్తూర్బాలో నిసరన తెలుపుతున్న టీఎస్‌యూటీఎఫ్ నాయకులు

'కేజీబీవీ ఉపాధ్యాయులకు పే స్కేల్ ఇవ్వాలి'

డోర్నకల్, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి) : కస్తూర్బాగాంధీ బాలికల విద్యాలయాల్లో పనిచేస్తున్న ఉపాధ్యాయులకు పేస్కేల్ ఇవ్వాలని టీఎస్‌యూటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి షేక్.మున్నీ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ మేరకు డోర్నకల్‌లో రెండ్రోజుల పాటు జరిగే నిరసన ప్రదర్శల్లో భాగంగా బుధవారం నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన వ్యక్తం చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతీనెల ఒకటవ తేదీనే వేతనాలు చెల్లించే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. మంజుల, సుధ, శ్యామల, జ్యోతి, లక్ష్మీకాంత, ఫరీద, కృష్ణవేణి, స్వాతి, శ్రీదేవి, శ్రీలత, సౌజన్య పాల్గొన్నారు.

- నెల్లికుదురు : కస్తూర్బా గాంధీ పాఠశాల ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలని టీఎస్‌యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు మురళీకృష్ణ తెలిపారు. నెల్లికుదురులోని కస్తూర్బాగాంధీ పాఠశాలలో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉపాధ్యాయులకు సిబ్బందికి సమానపనికి సమాన వేతనం ఇవ్వాలన్నారు. ఉద్యోగ భద్రత కల్పించి హెల్త్‌కార్డులు ఇవ్వాలన్నారు. సుమలత, రంజిత్‌కుమార్, జనార్ధన్, నరేందర్, భాస్కర్, యుగేందర్, రమ, శోభారాణి, సరోజ, సుమతి, వనిత, స్వరూప, జ్యోతి పాల్గొన్నారు.

- మరిపెడ రూరల్ : కస్తూర్బా గాంధీ బాలికా విద్యాలయాలు, అర్బన్ రెసిడెన్షియల్ పాఠశాలల్లోనే ఉపాధ్యాయులు, ఉద్యోగులకు సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం కనీస వేతనం (మినిమంపేస్కేల్) అమలు చేయాలని యూ టీఎఫ్ మండల అధ్యక్ష, కార్యదర్శులు లింగానాయక్, ప్రభాకర్ డిమాండ్ చేశారు. బుధవారం మధ్యాహ్న భోజన విరామ సమయంలో గిరిపురం వద్ద ఉన్న కేజీవీబీలో నల్ల బ్యాడ్జీలు, ప్లకార్డులు ధరించి నిరసన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి జనార్ధనాచారి, నెహ్రూ, గోవర్ధన్, ఉపాధ్యా యులు మాధవి, జ్యోతి, ఉప్పలమ్మ, శ్రీలత, రమ, భవాని, పద్మ, ఉమాదేవి, కనకలక్ష్మి, జ్యోతి పాల్గొన్నారు.

ఎస్సారెస్పీ పనులను అడ్డుకోవద్దు : ఈఈ

దంతాలపల్లి, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి) : డీబీఎం 60 నుంచి వెళ్లే 9ఎల్ ఉప కెనాల్ తవ్వకం పనులను రైతులు అడ్డుకుంటే కఠిన చర్యలు తీసుకుంటామని ఈఈ సల్మాన్‌రాజ్ హెచ్చరించారు. బుధవారం ఆయన మండలంలోని తూర్పుతండా గ్రామ, రామవరం శివారులో ఇటీవల ఎస్సారెస్పీ పనులు నిలిచిన చోటు వద్ద రైతులతో మాట్లాడారు. ఈ సందర్భంగా ఈఈ సల్మాన్‌రాజ్ మాట్లాడుతూ రైతులకు కావల్సిన నష్ట పరిహారాన్ని ప్రభుత్వం ఇచ్చేందుకు సిద్ధంగా ఉందన్నారు. 7కిలో మీటర్ల 9ఎల్ కెనాల్ కేవలం 1.5కిలో మీటర్ల తవ్వకం మాత్రమే నలిచిపోయిందన్నారు. దీంతో రైతులకు సకాలంలో సాగునీటి రాక ఇబ్బందులు తలెత్తుతున్నాయన్నారు. కెనాల్ ఇరువైపులా ఉన్న రైతులు పరస్పరం సహకరిస్తే కెనాల్ తవ్వకం పనులను సకాలంలో చేపడతామన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో గణేష్, ఎస్సారెస్పీ డీఈ రాజ్‌కుమార్, తహసీల్దార్ రాజేశ్వర్, గిర్దావర్ నజీముద్దిన్, వర్క్‌ఇన్‌స్పెక్టర్ దేవేందర్‌నాయక్ తదితరులు పాల్గొన్నారు.

ప్రకృతి వైపరీత్యాల వల్ల నష్టపోతున్న రైతులు

మరిపెడ రూరల్, నవంబరు 27(ఆంధ్రజ్యోతి) : ఏటా ప్రకృతి వైపరీత్యాల వల్ల పాలేరు, ఆకేరు వాగులు ఉప్పొంగి ప్రవహించడంతో సమీపాన ఉన్న పంటపొలాలు అన్నీ ఆగమైన పోతున్నాయని, దీనికి శాశ్వత పరిష్కారం చూపాలని లంబాడీల ఐక్య వేదిక రాష్ట్ర సమన్వయ కర్త రమేష్‌జాదవ్ డిమాండ్ చేశారు. బుధవారం తానంచర్లలో ప్రవహిస్తున్న పాలేరు వాగు వద్ద ఆయన మాట్లాడారు. నియోజకవర్గంలోనే పాలేరు, ఆకేరువాగు ఒడ్డున ఉన్న రైతాంగానికి ఈ వాగులు దుఃఖదాయనిగా మారాయన్నారు. తానంచర్ల, పురుషోత్తామాయగూడెం, చిన్నగూడురు మండలంలో ఉన్న గంగమ్మలకు రెండునెలల క్రితం వచ్చిన భారీ వర్షానికి ధ్వంసం కావడమే కాకుండా వంతెనలు కూడా కొట్టుకుపోయాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా ప్రభుత్వ అధికారులు స్పందించి త్వరతగితిన కూలిపోయిన వంతెలు నిర్మించాలని డిమాండ్ చేశారు.

గిరిజన హాస్టళ్లపై సర్కార్ సవతితల్లి ప్రేమ



కురవి మండల కేంద్రంలో మాట్లాడుతున్న మాలోతు కిషన్‌నాయక్

కురవి, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి) : గిరిజన హాస్టళ్లపై ప్రభుత్వం సవతితల్లి ప్రేమ చూపుతుందని గిరిజన సంఘం రాష్ట్ర కమిటీ సభ్యుడు మాలోతు కిషన్‌నాయక్ విమర్శించారు. కురవిలో తెలంగాణ గిరిజన సంఘం ఆధ్వర్యంలో బుధవారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఫుడ్‌పాయిజన్‌తో అవస్థకు గురై కొన్నిరోజులుగా నిమ్స్‌లో చికిత్స పొందుతున్న విద్యార్థిని మృతి చెందడం విచారకరమన్నారు. ఆసిఫాబాద్ జిల్లా వాకిటి గిరిజన ఆశ్రమ పాఠశాలలో అక్టోబర్ 29న 60 మంది విద్యార్థినులు అస్వస్థతకు గురైన ఘటనలో శైలజా మృతి చెందడం కాంగ్రెస్ ప్రభుత్వ పనితీరుకు నిదర్శనమన్నారు. ఈ ఘటనకు కారణమైన సంబంధిత అధికారులను తక్షణమే సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షులుదేవానాయక్, మున్నీనాయక్, వెంకన్న, రాజా, స్వామి, రమేష్ పాల్గొన్నారు.

గొల్లకురుమల హక్కుల సాధనకు ప్రజాభవన్ ముట్టడి


తహసీల్దార్‌కు వినతిపత్రం అందిస్తున్న గొల్లకుర్మలు

తొర్రూరు, నవంబరు27 (ఆంధ్రజ్యోతి) : గొల్లకుర్మల హక్కులను సాధించుకునేందుకు ప్రజాభవన్ ముట్టడిని చేపడుతున్నామని గొర్ల మేకల పెంపకందారుల జిల్లా ఉపాధ్యక్షుడు కొమ్మనబోయిన యాకయ్య తెలిపారు. బుధవారం తొర్రూరు మండల కమిటీ ఆధ్వర్యంలో పలు డిమాండ్లతో తహసీల్దార్ శ్రీనివాస్‌కువినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వంగొల్లకుర్మలను మోసం చేస్తుందని, ఎన్నికల ముందు బీసీ డిక్లరేషన్‌లో గొల్ల కుర్మలకు గొర్లను ఇస్తానని మోసం చేసిందని, వాటికి బదులుగా రూ.2లక్షల నగదు బదిలీ చేస్తామని హామీ ఇచ్చి, విస్మరించిందన్నారు. 50 ఏళ్లు నిండిన వారికి రూ.5 వేల పెన్షన్, గొర్ల మేకలకు ప్రభుత్వం ఇన్సూరెన్స్ చేయించా లన్నారు. తదితర హామీల అమలుకు డిసెంబర్ 9న నిర్వహించే ప్రజాభవన్ ముట్టడికి గొల్ల కుర్మలు అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని కోరారు. జీఎంపీఎస్ నాయకులు బొల్లం అశోక్, ఎద్దు ఐలయ్య, రామకృష్ణ, నాగరాజు, శ్రీను, అరవింద్, మురళి ఉన్నారు.

- ఇనుగుర్తి : గొర్రెలకు బదులుగా నగదు బదిలీ చేస్తామని హామీ ఇచ్చి అమలు చేయకుండా గొల్లకురుమలను కాంగ్రెస్ ప్రభుత్వం మోసం చేసిందని గొర్రెలు, మేకల పెంపకందారుల సంఘం మండల అధ్యక్షుడు చిన్నాల కట్టమల్లు ఆరోపించారు. తమ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఇనుగుర్తి తహసీల్దార్ కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. సంఘం గౌరవ అధ్యక్షుడు చిన్నాల కట్టయ్య, నామాల మహేష్, బొబ్బాల ముత్తయ్య, చిరబోయిన సతీష్, నర్రా ఉమేష్, సుధాకర్, అశోక్, అనీల్, రాజు, పరశురాములు, శ్రీను, కొమురయ్య పాల్గొన్నారు.

టెన్త్ విద్యార్థులకు చిరుతిండి పంపిణీ


బిస్కెట్ ప్యాకెట్లను పంపిణీ చేస్తున్న మార్కెట్ చైర్మన్ గంట సంజీవరెడ్డి

కేసముద్రం, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని కల్వల జడ్పీ ఉన్నత పాఠశాలలో బుధవారం ప్రత్యేక తరగతులకు హాజరవుతున్న పదో తరగతి విద్యార్థులకు సాయంత్రం పూట చిరుతిండిని మాజీ సర్పంచ్, మార్కెట్ చైర్మన్ గంట సంజీవరెడ్డి పంపిణీ చేశారు. వంద రోజుల పాటు ఈ విద్యార్థులకు చిరుతిండి అందించేందుకు రూ.10వేలను పాఠశాలకు అందజేశారు. ఈ సందర్భంగా గంట సంజీవరెడ్డి మాట్లాడుతూ విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించి గ్రామానికి మంచి పేరు తీసుకురావాలని కోరారు. కార్యక్రమంలో హెచ్‌ఎం బండారు నరేందర్, రాచకొండ యాకాంబ్రం, తండ సదానందం, పీడీ కొప్పుల శంకర్, కాంగ్రెస్ గ్రామపార్టీ అధ్యక్షుడు గండి శ్రీనివాస్, పెదగాని రవి పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి పరామర్శ

మరిపెడ, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి) : బాధిత కుటుంబ సభ్యులను బుధవారం జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ గుడిపూడి నవీన్‌రావు పరామర్శించారు. మరిపెడ మునిసిపల్ పరిధి మందుల కాలనీకి చెందిన పెండ్రా భూపాల్ అనారోగ్యంతో మృతి చెందారు. ఈ విషయం తెలిసి నవీన్‌రావు బాధిత కుటుంబాన్ని కలుసుకొని రోదిస్తున్న కుటుంబసభ్యులను ఓదార్చారు. ఆయన వెంట పద్మశాలి సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి దిగిజర్ల శ్రీనివాస్, మరిపెడ వార్డు కౌన్సిలర్స్ పానుగోత్ వెంకన్న, బయ్య భిక్షం, కిషన్, మాచర్ల భద్రయ్య తదితరులు ఉన్నారు.

హౌసింగ్ బోర్డు కాలనీ వాసుల కార్తీక వనభోజనాలు


మొగిలిచర్లలో వనభోజనాలకు వెళ్లిన హౌసింగ్‌బోర్డు కాలనీ వాసులు

మహబూబాబాద్‌టౌన్, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి) : మానుకోట పట్టణంలోని హౌసింగ్‌బోర్డు కాలనీ వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో బుధవారం కార్తీక వనభోజనాలకు వెళ్లారు. జిల్లాలోని కురవి మండలం మొగిలిచర్ల గ్రామంలోని నూకల నర్సింహారెడ్డి మామిడితోటలో ఉసిరిచెట్టు వద్ద హౌజింగ్ బోర్డు కాలనీ మహిళలు ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం కార్తీక వనభోజనాలు చేశారు. ప్రతీ సంవత్సరం కార్తీకమాసంలో వనభోజనాల కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు కాలనీ వాసులు తెలిపారు.

మాల ధరించిన డ్రైవర్‌కు బ్రీత్ ఎనలైజర్ టెస్ట్?

వీడియో వైరల్.. ఖండించిన భక్తులు

తొర్రూరు, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి) : మాల ధరించిన ఆర్టీసీ డ్రైవర్‌కు బ్రీత్ ఎనలైజర్ ద్వారా పరీక్షలు నిర్వహించారంటూ బుధవారం సోషల్ మీడియాలో వైరల్ అయిం ది. తొర్రూరు ఆర్టీసీ డిపోలో విధులు నిర్వహిస్తున్న డ్రైవర్లు కొందరు అయ్యప్ప మాల ధరించి విధులకు హాజరవుతున్నారు. ఆర్టీసీ విజిలెన్స్ సిబ్బంది మాల ధరించిన డ్రైవర్‌లను బ్రీత్ ఎన లైజర్‌తో పరీక్షలు నిర్వహిస్తున్నారని, వారిని కించపరిచే విధంగా తాగావా అని అడుగుతూ హిం దువుల మనోభావాలను దెబ్బతీస్తున్నారని పలువురు ఆరోపిస్తున్నారు. హిందువులను కించ పరి చే విధంగా ఆర్టీసీ అధికారులు, విజిలెన్స్ సిబ్బంది బ్రీత్ ఎనలైజర్‌తో పరీక్ష నిర్వహించడం ఎంత వరకు సమంజసమని అయ్యప్ప స్వామి మాలధారులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఆర్ఎస్ఎస్, విశ్వహిందూ పరిషత్ ఈ సంఘటను తీవ్రంగా ఖండించారు. ఈ విషయంపై ఆర్టీసీ డీఎం, విజిలెన్స్ సిబ్బందిని వివరణ కోరగా ఉదయం విధులకు హాజరైన వారికి బ్రీత్ ఎనలైజర్ టెస్టులు నిర్వహించిందివాస్తవమేనని, మధ్యాహ్నం 12 గంటలకు ఆర్టీసీ ఉన్నతాధికారుల నుంచి అయ్యప్ప మాలధారులకు పరీక్షలు నిర్వహించవద్దని మౌఖిక ఆదేశాలు అందాయని, పూర్తి ఆదేశాలు వచ్చిన తర్వాత పరీక్షలు నిలిపివేస్తామన్నారు.

ప్రజాపాలన విజయోత్సవ కళాప్రదర్శనలు


కళాప్రదర్శనలు నిర్వహిస్తున్న సాంస్కృతిక సారథి కళాకారులు

కేసముద్రం, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి) : అర్పనపల్లి, ఉప్పరపల్లి, పెనుగొండ గ్రామాల్లో బుధవారం తెలంగాణ సాంస్కృతిక సారథి కళాకారుల ఆధ్వర్యంలో కలెక్టర్ ఆదేశాల మేరకు రాష్ట్రప్రభుత్వ ప్రజాపాలన విజయోత్సవాల సందర్భంగా కళాప్రదర్శనలు నిర్వహించారు. ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలపై ఆట,పాటలతో కళాకారులు ప్రజలకు వివరించారు. ఈ కార్యక్రమంలో మేరుగు రవీందర్‌గౌడ్ ఆధ్వర్యంలోని కళాబృందం కొలిశెట్టి సత్యనారాయణ, దర్శనం యుగేందర్, ఆరెపల్లి నరేష్, యాకూబ్‌షావలి, కీర్తి కొడుమూరి, దేశెట్టి ప్రవీణ్‌కుమార్, డాంగి రోజా, వజ్జ రాజలక్ష్మి పాల్గొన్నారు.

షూటింగ్‌బాల్ పోటీలకు జడ్పీహెచ్ఎస్ విద్యార్థి ఎంపిక

నెల్లికుదురు, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి) : జాతీయ స్థాయి షూటింగ్‌బాల్ పోటీలకు నెల్లికుదురు జడ్పీహెచ్ఎస్ విద్యార్థి భూక్య జగన్ ఎంపికైనట్లు ప్రధానోపాధ్యాయుడు రవి తెలిపారు. నవంబర్ 29న బీహార్ రాష్ట్రంలోని బుద్ధగయలో జరిగే 43వ జాతీయస్థాయి పోటీలలో పాల్గొననున్నట్లు తెలిపారు భూక్య జగన్‌ను పాఠశాల ఉపాధ్యాయ బృందం అభినందించారు. ఈ కార్యక్రమంలో పీడీ ఐలయ్య, జలగం శ్రీను, సీహెచ్.శ్రీనివాస్ పాల్గొన్నారు.

పిల్లల విద్యాభివృద్ధికి తల్లిదండ్రులు సహకరించాలి


తల్లిదండ్రులతో మాట్లాడుతున్న జడ్పీ హైస్కూల్ ఉపాధ్యాయులు

డోర్నకల్, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులతల్లిదండ్రులు వారి విద్యాభివృద్ధికి సహకరించాలని డోర్నకల్ జడ్పీ హైస్కూల్ హెచ్‌ఎం బండి నర్సింహారావు అన్నారు. పాఠశాలలో చదువుతున్న విద్యార్థులు పరీక్షలలో చూపిన ప్రతిభ ఆధారంగా విద్యార్థుల ఇంటికి స్వయంగా ఉపాధ్యాయులతో బుధవారం కలిసి వెళ్లి తల్లిదండ్రులకు అవగాహన కల్పించారు. విద్యార్థులను క్రమం తప్పకుండా పాఠశాలకు పంపించాలని, పాఠశాల నుంచి వచ్చిన తర్వాత చదువుపట్ల శ్రద్ధ తీసుకోవాలని సూచించారు. విద్యార్థులకు అంకితభావంతో విద్యాబోధన చేస్తున్నామని, ఈ ఏడాది ఉత్తమ ఫలితాలు సాధించేందుకు తల్లిదండ్రుల సహకారం సైతం ఉండాలని విజ్ఞప్తి చేశారు.

'విద్యార్థులకు పదో తరగతి కీలకం'

పెద్దవంగర, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి) : విద్యార్థుల జీవితంలో పదో తరగతి ఎంతో కీలకం అని వందేమాతరం ఫౌండేషన్ నిర్వాహకులు రవీంద్ర అన్నారు. బుధవారం పెద్దవంగర జడ్పీ ఉన్నత పాఠశాల పదో తరగతి విద్యార్థుల తల్లిదండ్రుల ప్రత్యేక సమావేశంలో ఆయన మాట్లాడారు. విద్యార్థులకు ఎస్సెస్సీ జీవితంలో తొలిమెట్టు అని, పాఠశాల లోపల, బయట ప్రపంచంలో సైతం సత్ప్రవర్తన కలిగి ఉండాలన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో కార్పొరేట్ స్థాయిలో నాణ్యమైన విద్య అందుతుందని, పదో తరగతిలో జీపీఏ పదికి పది సాధించి పలువురికి ఆదర్శంగా నిలవాలన్నారు. తల్లిదండ్రులు కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంఈవో శ్రీనివాస్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

సేవ చేసేందుకే అమెరికా నుంచి పాలకుర్తికి..

పాలకుర్తి, నవంబరు 27(ఆంధ్రజ్యోతి) : స్థానిక ఎమ్మెల్యే మామిడాల యశస్వినిరెడ్డి, కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి ఝాన్సీరెడ్డి ప్రజలకు సేవ చేసేందుకే అమెరికా నుంచి పాలకుర్తికి వచ్చారని కాంగ్రెస్ మండల అధ్యక్షుడు గిరగాని కుమారస్వామి స్పష్టం చేశారు. బుధవారం పాలకుర్తిలోని క్యాంపు కార్యాలయంలో ఆయన మాట్లాడారు. గతంలో పంచాయతీరాజ్ శాఖకు మంత్రిగా ఉన్న దయాకర్‌రావు సర్పంచులకు బిల్లులు రాక కష్టాలు పడుతుంటే ఇప్పుడు మొసలి కన్నీరు కారుస్తున్నారని విమర్శించారు. నాయకులు మాజీ ఎంపీపీ కారుపోతుల శ్రీనివాస్, గాదెపాక భాస్కర్, రాజేష్‌నాయక్, మనెమ్మ, జల్లం కుమారస్వామి పాల్గొన్నారు.

ప్రసాద్ మరణం తీరని లోటు

- సీపీఐ రాష్ట్ర కమిటీ సభ్యుడు శ్రీనివాస్

గార్ల నవంబరు27 (ఆంధ్రజ్యోతి) : నమ్మిన సిద్ధాంతం కోసం తుదిశ్వాస వరకు ప్రజాసేవకు అంకితమైయి అకాల మరణం పొందిన సీపీఐ ఖమ్మం జిల్లా కార్యదర్శి పోటు ప్రసాద్ మరణం కమ్యూనిస్టు ఉద్యమానికి తీరనిలోటని సీపీఐ రాష్ట్ర కమిటీ సభ్యులు కట్టెబోయిన శ్రీనివాస్ అన్నారు. బుధవారం ఖమ్మం జిల్లా కేంద్రంలోగుండెపోటుతో మృతి చెందిన సీపీఐ జిల్లా కార్యదర్శి పోటు ప్రసాద్‌భౌతికకాయాన్ని కార్యకర్తల దర్శనార్థంసీపీఐ జిల్లా కార్యాలయంలో ఉంచారు. ఈసందర్భంగా ప్రసాద్ మృతదేహంపై పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు.ఈకార్యక్రమంలో మండల కార్యదర్శి జంపాల వెంకన్న ఎఐఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి మాగం లోకేష్ పాల్గొన్నారు.

ఆడపిల్లల లోటు సమాజానికి చేటు

నెహ్రూసెంటర్, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి) : ఆడపిల్లల లోటు సమాజానికి చేటు అని, సమాజంలో స్త్రీ, పురుషులు ఇరువురు సమానమేనని, స్త్రీ, పురుషుల మధ్య ఏ వివక్షత ఉండకూడదని మాస్‌మీడియా జిల్లా డిప్యూటీ అధికారి కొప్పు ప్రసాద్ అన్నారు. మహబూబాబాద్ శ్రీ చైతన్య పారా మెడికల్ ఒకేషనల్ కాలేజీలో బుధవారం పీసీపీఎన్‌డీటీ చట్టంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుత సమాజంలో అన్ని రంగాల్లో స్త్రీలు పురుషులతో పోటీ పడుతున్నారని, అయినా అడశిశువుల పట్ల వివక్ష పోలేదని చెప్పారు. పుట్టబోయేది ఆడశిశువు అని తెలియగానే కొన్ని సందర్భాల్లో గర్భస్రావానికి కొన్ని కుటుంబాలు సిద్ధపడుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. కళాశాల చైర్మన్ మోజెస్, జిల్లా ఆరోగ్య విద్యాబోధకులు వెంకటేశ్వరరాజు, వైస్ ప్రిన్సిపల్ తిరుమలదాస్, సబ్ యూనిట్ ఆఫీసర్ రామకృష్ణ పాల్గొన్నారు.

పీహెచ్‌సీని అప్‌గ్రేడ్ చేయాలి

నెల్లికుదురు, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్యకేంద్రాన్ని 30 పడకల ఆస్పత్రిగా అప్‌గ్రేడ్‌చేయాలని ప్రగతిశీల యువజన సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి కందాల రంగయ్య తెలిపారు. స్థానిక పీహెచ్‌సీని బుధవారం పరిశీలించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆస్పత్రిలో టెస్టులు చేయడానికి సౌకర్యాలు, సిబ్బందిలేక ఇబ్బంది పడుతున్నారన్నారు. ఈ కార్యక్రమంలో బండపెల్లి వెంకటేశ్వర్లు, పల్లెల పాపరావు, మోష పాల్గొన్నారు.